


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



**సువేందుకు అభినందనలు**

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సువేందు అధికారికి ఏపీ సీఎం చంద్రబాబు అభినందనల తెలిపారు. "ప్రజాసేవకు పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న సువేందుకు, మంత్రివర్గ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వం, ఆయన ఆకాంక్షిత వికసిత భారత్ స్ఫూర్తితో, ప్రజల ఆశీస్సులు, విశ్వాసంతో తన పదవీకాలాన్ని ప్రారంభిస్తున్న నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నా" అన్నారు.



## వైభవంగా త్రిశూల్

- ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడిన కైలాసగిరి
- విశాఖ పర్యాటకానికి సరికొత్త చిరునామా

4



## పదోన్నతులు పారదర్శకం

- 'సహకార' పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం
- సహకార మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

3



## బీసీ హాస్టళ్లు భేష్

- ఐవీఆర్ఎస్ సర్వేలో టాప్ ప్లేస్

5

# అమ్మవారి సన్నిధిలో లోకేష్

ప్రముఖ పుణ్యక్షేత్రం విజయవాడ ఇంద్రకిలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను ఐటీ శాఖ మంత్రి, టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ దర్శించుకున్నారు. శనివారం ఉదయం ఆలయానికి వచ్చిన మంత్రికి దేవాదాయ కమిషనర్ రాంచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్, పాలక మండలి చైర్మన్ బొర్రా రాధా కృష్ణ.. పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో లోకేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



2



## గొప్ప సంస్కృతికి ఏపీ నెలవు

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్

3



6

## విధ్వంసం నుంచి వికాసవైపు పాలన

- భయపెట్టే రాజకీయాలకు కాలంచెల్లింది
- భరోసా కలిగించే పరిపాలన వచ్చింది..
- ప్రజలకు అందుబాటులో ప్రభుత్వం పనిచేస్తోంది
- వైజాగ్ అంటే ఒకప్పుడు గంజాయి గుర్తొచ్చేది..
- నేడు గూగుల్, టీసీఎస్‌లు గుర్తుకొస్తున్నాయి
- మీడియా సమావేశలో మంత్రి సంధ్యారాణి

# విశాఖకు సెమీ రింగ్ రోడ్

**రాంబిల్లినుంచి భోగాపురం వరకు 102కి.మీ మేర నిర్మాణం**

**వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌పై సమీక్షలో మంత్రి నారాయణ**

రానున్న 50 ఏళ్లలో విశాఖ నగరాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సెమీ రింగురోడ్డు నిర్మిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ అన్నారు. రాంబిల్లినుంచి భోగాపురం వరకు 102 కి.మీమేర రింగు రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌పై మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి అధికారులతో నారాయణ సమీక్ష నిర్వహించారు.




5









పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రమాణ స్వీకారానికి హాజరై సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. తొలుత -శనివారం ఉదయం కోల్‌కతా చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడికి ఎయిర్ పోర్టులో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు, పశ్చిమ బెంగాల్ నేతలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఎయిర్ పోర్టులోనే ముఖ్యమంత్రి చంద్రబాబును గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ కలుసుకుని స్వాగతించారు. అక్కడినుంచి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార కార్యక్రమానికి సీఎం చంద్రబాబు బయలుదేరి వెళ్లారు. పశ్చిమబెంగాల్ సీఎం సువేందు అధికారి ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రధాని నరేంద్ర మోదీ ఆప్యాయంగా పలకరించి స్వాగతించారు. వేదికపై ఉన్న ఎన్డీఏ నేతలకు సీఎం చంద్రబాబు అభివాదం చేసి.. ఆసీనులయ్యారు.















# అమ్మవారి సన్నిధిలో లోకేష్

విజయవాడ (చైతన్య రథం): ప్రముఖ పుణ్యక్షేత్రం విజయవాడ ఇంద్రకిలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను ఐటీ శాఖ మంత్రి, టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ దర్శించుకున్నారు. శనివారం ఉదయం ఆలయానికి వచ్చిన మంత్రికి దేవాదాయ కమిషనర్ రాంచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్, పాలక మండలి చైర్మన్ బొర్ర రాధా కృష్ణ.. పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో లోకేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం అనంతరం లోకేశ్‌కు వేద పండితులు ఆశీర్వాదం అందించగా... అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందజేశారు. లోకేశ్ రాకతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా దుర్గమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ అభివృద్ధి గురించి అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అమ్మవారి దర్శనం కల్పించాలని అధికారులకు తెలిపారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చిన చిన్నారులను, భక్తులను మంత్రి లోకేష్ ఆప్యాయంగా పలకరించి ఆనందపర్చారు.







## వేమూరు పెళ్లి వేడుకలో మంత్రి లోకేష్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు (ఏపీఎన్ఆర్టీ) సొసైటీ అధ్యక్షుడు వేమూరు రవికుమార్ కుమారుడి వివాహ వేడుకలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో జరిగిన వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులు కిరణ్, పుష్పలతలను ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు.





## బోయపాలెం సర్పంచ్ కుమార్తె వివాహ వేడుకలో మంత్రి లోకేష్

మంగళగిరి (చైతన్య రథం): విశాఖ జిల్లా బోయపాలెం సర్పంచ్, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు కుమార్తె వివాహ వేడుకకు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జరిగిన పెళ్లి వేడుకలో పాల్గొని నూతన వధూవరులు జ్యోత్స్న, కళ్యాణ కృష్ణలను ఆశీర్వదించారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

చైతన్యరథం

# పారదర్శకంగా ప్రమోషన్లు, పోస్టింగులు!

- **సహకార శాఖలో ఉద్యోగులకు సమయానికి పదోన్నతులు**
- **వారి ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది**
- **సహకార మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



అమరావతి (చైతన్య రథం): సహకార శాఖలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100 మంది వివిధ కేడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా, ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు నేతృత్వంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, పదోన్నతులు పొందిన ఉద్యోగులు విజయవాడలో వ్యవసాయ, సహకార శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆదేశాల మేరకు పదోన్నతులు త్వరితగతిన మంజూరు చేయడమే కాకుండా, పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగ్ ఆర్డర్లు జారీ చేసినందుకు ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది. ప్రమోషన్లు పొందిన ఉద్యోగుల అభ్యర్థన మేరకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేక్ కట్ చేసి ఉద్యోగులతో ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడమే కాకుండా, అవినీతికి ఆస్కారం లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగులు ఇవ్వడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఉద్యోగులు సానుకూల వాతావరణంలో పనిచేసేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని, వారి హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అలాగే సహకార శాఖలో వివిధ కేడర్ల ఉద్యోగులకు జారీ చేసిన ప్రమోషన్లలో 100 శాతం పారదర్శకత పాటించామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలో సహకార శాఖలో వివిధ కేడర్లలో దాదాపు 350కు పైగా ప్రమోషన్లు కల్పించబడినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో ప్రమోషన్ ప్రక్రియ అమలు చేయడం వల్ల ఈ ప్రక్రియ వేగవంతమైందన్నారు. అలాగే మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇచ్చిన ఆదేశాలతో ప్రమోషన్లు, పోస్టింగులు అత్యంత పారదర్శకంగా అమలయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి జీసీబీవీ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు డి. విజయ్ కుమార్, పి. రాజశేఖర్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ గౌస్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి జి. సందీప్, సహా అధ్యక్షుడు యు. రమేష్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు వై. యేసు కుమార్, గుంటూరు జిల్లా కార్యదర్శి ఎస్. భావనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ గొప్ప సంస్కృతీ సంప్రదాయాలకు నెలవు



## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్
## రాజమహేంద్రవరంలో నూతన కోర్టుల భవన సముదాయం ప్రారంభం

రాజమహేంద్రవరం (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ గొప్ప సంస్కృతి, సంప్రదాయాలకు నెలవని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ అన్నారు. ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, న్యాయ కోవిదులకు ఈ నేల పుట్టినిల్లు అని కొనియాడారు. శనివారం రాజమహేంద్రవరంలో నూతన 10 కోర్టుల భవన సముదాయాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థలో డిజిటలైజేషన్ ప్రక్రియది కీలకపాత్ర అన్నారు. న్యాయవ్యవస్థలో సాంకేతికతను అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. ఏఐ వినియోగంపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. న్యాయ మౌలిక వసతులు కేవలం ఇటుకలు, సిమెంట్‌తో నిర్మించిన భవనాలు మాత్రమే కాకుండా.. ప్రజల భావోద్వేగాలకు, న్యాయ వ్యవస్థ నిబద్ధతకు ప్రతీకలని జస్టిస్ లిసా గిల్ పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించినప్పుడే న్యాయం సమాజంలోని ప్రతి వర్గానికీ చేరుతుందన్నారు. రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి ప్రాంతాల సాంస్కృతిక, సాహిత్య, న్యాయవారసత్వాన్ని ప్రస్తావిస్తూ, ఈనేలనుంచి అనేకమంది ప్రముఖ న్యాయమూర్తులు, న్యాయవాదులు, సాహితీవేత్తలు, స్వాతంత్ర్య సమరయోధులు వెలుగులోకి వచ్చారని కొనియాడారు. న్యాయ వ్యవస్థలో సాంకేతికత ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందని, డిజిటలైజేషన్ ఇప్పుడు అనివార్యమైందని ఆమె అన్నారు. కోవిడ్ కాలంలో కూడా భారత న్యాయస్థానాలు ప్రజలకు అందుబాటులో ఉండటం దేశ న్యాయ వ్యవస్థ గొప్పతనమని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. మీడియేషన్ కేవలం కుటుంబ వివాదాలు, మోటార్ ప్రమాద కేసులకు మాత్రమే పరిమితం చేయరాదన్నారు. వివాదాలను తీర్పుతో ముగించడమే కాకుండా, పరస్పర అవగాహనతో పరిష్కరించడమే నిజమైన విజయమని పేర్కొన్నారు. న్యాయవాదులు, న్యాయాధికారులు మీడియేషన్‌ను మరింత ప్రోత్సహించాలని కోరారు. కోర్టులు కేవలం వివాదాలు తీర్చే స్థలాలుగా కాకుండా, పరస్పర విభేదాలు తొలగి సఖ్యత నెలకొనే వేదికలుగా మారాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ ఆర్ రఘునందన్ రావు, జస్టిస్ బి.వి.ఎల్.ఎన్. చక్రవర్తి, జస్టిస్ సుమతి జగడం, జస్టిస్ న్యాపతి విజయ్ , జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్.వి. ప్రసాద్, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, ఎస్పీ డి నరసింహ కిషోర్, మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

# వైద్య పరికరాల కొనుగోలు అక్రమాలపై నివేదిక కోరిన మంత్రి



- **ఆరోపణలకు చోటులేకుండా సమగ్ర సంస్కరణలకు ఆదేశం**
- **వైద్య సిబ్బంది సర్వీసు సమస్యలను పరిష్కరించాలి**
- **రానున్న సాధారణ బదిలీ ప్రక్రియ సజావుగా సాగాలి**
- **ఆదేశాలు జారీ చేసిన వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్**

అమరావతి (చైతన్య రథం): వైద్య పరికరాల కొనుగోలులో అక్రమాలు జరుగుతున్నట్టు మీడియాలో వస్తున్న వార్తా కథనాలపై వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ సమగ్ర నివేదిక కోరారు. ఈ విషయంతోపాటు వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు ఇతర విషయాలపై మంత్రి శనివారం కార్యదర్శి సౌరభ్ గౌర్‌కు లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు.

### నివేదించాల్సిన అంశాలు

ఎక్కువ ధరలకు వైద్య పరికరాలను కొనుగోలు చేస్తున్నట్లు, అవసరంలేని వాటిని కొంటున్నట్లు, కొంతమంది సరఫరాదారులకు అనుగుణంగా ఉండేలా సాంకేతిక ప్రమాణాలు రూపొందిస్తున్నట్లు, గతంలో సరఫరా చేసేందుకు అనర్హులుగా నిర్ణయించిన వారికి తిరిగి అవకాశాలు ఇస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్రంగా నివేదికను అతి త్వరలో సమర్పించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యదర్శిని ఆదేశించారు.

ఎటువంటి ఆరోపణలకు తావులేకుండా... నియమ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే పారదర్శకతతో కూడిన వాతావరణంలో వైద్య పరికరాల కొనుగోలు జరుగుతుందన్న విశ్వాసాన్ని సరఫరాదారులలో కలిగించాల్సిన అవసరాన్ని మంత్రి స్పష్టం చేశారు. ఈ దిశగా సమగ్ర సంస్కరణ ప్రక్రియను సూచించాలని మంత్రి ఆదేశించారు.

### అంతా అధికారుల చేతుల్లోనే...

వైద్య పరికరాల కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదనలను తయారుచేయడం, ఆయా పరికరాలకు సంబంధించిన సాంకేతిక ప్రమాణాల్ని రూపొందించడం, తగు నిబంధనల్ని రూపొందించి టెండర్లను పిలవడం, వాటిపై తుది నిర్ణయాల్ని తీసుకోవడం ఆయా అధికారులే నిర్ణయిస్తారని, దీనిని లోపభూయిష్టంగా చేసేందుకు తగు సూచనలు చేయాలని కూడా మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యదర్శిని ఆదేశించారు.

### మంత్రికి ఈడీ వివరణ

మీడియాలో వచ్చిన వార్తా కథనాల నేపథ్యంలో ఎపిఎంఎస్ఐడిసి ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణమోహన్ శనివారం ఉదయం మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి తన పాత్రపై వివరణ ఇచ్చారు. ఆయా వైద్య పరికరాల కొనుగోలుకు సంబంధించిన సాంకేతిక ప్రమాణాల (టెక్నికల్ స్పెసిఫికేషన్) నిర్ధారణలో తనకు ఎట్టి పాత్ర లేదని, కేవలం రెండు సందర్భాల్లోనే తాను సాంకేతిక ప్రమాణాలను పునః పరిశీలించాలని సూచించానని వివరణ ఇచ్చారు. దంత వైద్యులు వాడే పేషెంట్ కుర్చీలకు సంబంధించి ఒక కంపెనీ పేరుతో వారి ప్రమాణాలను వైద్యులు సూచించగా, అది నిబంధనలకు విరుద్ధం కనుక పునః పరిశీలించాలంటూ సూచించానని ఈడీ వివరించారు. సిటి స్కాన్ కొనుగోలుకు వైద్యులు సూచించగా, అట్టి పరికరాల కొనుగోలు, సరఫరా తగ్గిన నేపథ్యంలో పునఃపరిశీలించాలని మాత్రమే సూచించానని మంత్రికి తెలిపారు. తానెటువంటి అక్రమాలకు పాల్పడలేదని స్పష్టం చేశారు.

### ఇతర అంశాలు

2026 సంవత్సరానికి సంబంధించి సాధారణ బదిలీలు చేపట్టే అవకాశమున్నందున, గత ఏడాది అనుభవాల నేపథ్యంలో ఈసారి చేపట్టే ప్రక్రియ మరింత పటిష్టంగా జరగడానికి తగు చర్యలు చేపట్టాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ శాఖ కార్యదర్శిని ఆదేశించారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు బదిలీల నుండి మినహాయింపులిచ్చే అంశాన్ని లోతుగా పరిశీలించి తగు సూచనలు చేయాలని, సమర్ధవంతమైన ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా తక్కువ వ్యవధిలో లోపరహితమైన బదిలీలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. తమ సర్వీసు విషయాలు, సమస్యలకు సంబంధించి పలువురు వైద్యులు, సిబ్బంది సంఘాలు ఇచ్చిన వినతులు అపరిష్కృతంగా ఉన్నాయని, వీటన్నింటినీ పరిశీలించి సాధ్యాసాధ్యాలపై విస్తృత చర్చల కోసం వెంటనే ఒక నివేదికను సమర్పించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యదర్శి సౌరభ్ గౌర్‌ను ఆదేశించారు.

చైతన్యరథం



# అత్యంత వైభవంగా త్రిశూల్

## ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడిన కైలాసగిరి - విశాఖ పర్యాటకానికి సరికొత్త చిరునామాగా త్రిశూల్

విశాఖపట్నం (చైతన్య రథం): విశాఖ పర్యాటక మణిహారమైన కైలాసగిరి నూతనంగా ఏర్పాటు చేసిన 65 అడుగుల డమరుకం తో కూడిన త్రిశూల్ ప్రారంభోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శనివారం ఉదయం కైలాసగిరిపై మహా శివుడుకి ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం త్రిశూలానికి పూజలు చేశారు. మున్సిపల్ మంత్రి నారాయణ, రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు, ఎమ్మెల్యేలు విష్ణు కుమార్ రాజు, వంశీ కృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణ మూర్తి, లోకం నాగమాధవి, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ తదితరులు పాల్గొని త్రిశూల్ శిలాఫలకం ఆవిష్కరించారు.

అనంతరం రాష్ట్ర మంత్రి నారాయణ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు పర్యాటకానికి పెద్ద పీట వేస్తున్నారని, పర్యాటకం ద్వారా ఆదాయం రావటమే కాకుండా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కైలాసగిరి ఒక పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. 65 అడుగుల ఎత్తున త్రిశూల్‌ను ఏర్పాటుచేసిన విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌ని, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ నగరాన్ని అత్యున్నత నగరంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. వేల కోట్లు పెట్టుబడులు తీసుకువస్తున్నారని వివరించారు. త్రిశూల్ అనేది విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ కల అని, అది ఈరోజు సాకారమైందన్నారు. కైలాసగిరిపై ప్రారంభించిన త్రిశూల్ విశాఖ పర్యాటకానికి చిహ్నంగా నిలుస్తుందన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ కైలాసగిరిపై నలుమూలల నుంచి కనిపించేలా ఏర్పాటుచేసిన త్రిశూల్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందన్నారు. కైలాసగిరిని మరింత అభివృద్ధి చేసేలా మాస్టర్ ప్లాన్ రూపొందించటం



కోసం సన్నాహాలు చేస్తున్నామన్నారు. గాలుల తీవ్రతను తట్టుకునేలా త్రిశూల్ నిర్మాణం జరిగిందన్నారు. వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేష్ మార్గదర్శకత్వంలో విశాఖను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగా 65 అడుగుల డమరుకంతో కూడిన త్రిశూల్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. కైలాసగిరిని కేవలం పర్యాటక ప్రాంతంగానే కాకుండా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా త్రిశూల్ ప్రాజెక్ట్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే కైలాసగిరిపై శివ పార్వతుల విగ్రహాలు పర్యాకులను ఆకర్షిస్తున్న నేపథ్యంలో మహాశివుని ఆయుధం త్రిశూల్‌ను హనుమంతవాక వ్యూ పాయింట్‌వద్ద మరింత పర్యాటక చిరునామాగా త్రిశూల్ నిలుస్తుందన్నారు.

త్రిశూల్ ఏర్పాటు చేసిన ప్రదేశంలో శివ నామస్మరణ మార్మోగింది. త్రిశూల్ నమూనాలతో పలువురు అలరించారు. దీంతో కైలాసగిరిపై సరికొత్త ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ కార్యదర్శి మురళీ కృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ఎస్ఈ రాంబాబు, డిఎఫ్ఓ శిరీష, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది, పలువురు కూటమి పార్టీల నాయకులు, ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ప్రతినిధులు, అన్నమయ్య ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి

# కూటమి కట్టుబడి ఉంది: ఆనం

ఏలూరు (చైతన్య రథం): రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధి, ఆలయాల్లో భక్తుల సౌకర్యాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో వివిధ ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ద్వారకాతిరుమలలో వేంచేసివున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న మంత్రి ఆనం.. దర్శనానంతరం వేద ఆశీర్వచనం అందుకున్నారు. మంత్రి ఆనంకు దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజుతో కలిసి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ఆనం ప్రారంభించారు. దాదాపు రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అనివెట్టి మండపం ఫేజ్-2 పనులకు శ్రీకారం మంత్రి శ్రీకారం చుట్టారు. భక్తుల సౌకర్యార్థం రూ.12.5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న క్యూ కాంప్లెక్స్ పనులను ప్రారంభించారు. రూ.4.5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న శివాలయం ఐదు అంతస్తుల రాజగోపుర నిర్మాణ పనులను మంత్రి ఆనం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు, ధర్మకర్తల మండలి వంశపారపర్య ధర్మకర్త రాజా సూరనేని వెంకట సుధాకర్ రావు, అనువంశిక ధర్మకర్త సురనేని నివృత్తరావు, పాలక మండలి సభ్యులు, సంయుక్త కమిషనర్, కార్యనిర్వాహణాధికారి త్రినాధరావు, దేవాదాయ శాఖ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.





# ప్రభుత్వ భూములను మింగేశారు

- వైసీపీ నేతలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- జగనన్న రీసర్వే లోపాలు.. 35సెంట్ల భూమి మాయం
- మాజీ సైనికుడి భూమిపై కబ్జాదారుల కన్ను..
- న్యాయం చేయాలంటూ బాధితుడి ఆవేదన
- యూజీడీ ప్రాజెక్ట్ పేరిట భూమి దోపిడీ..
- అర్జీలు స్వీకరించిన మంత్రి సంధ్యారాణి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ శ్రీదేవి



మంగళగిరి (చైతన్య రథం): ప్రభుత్వ భూములను మింగేయడమే కాదు, ప్రయివేట్ భూములనూ వైసీపీ నేతలు కైంకర్యం చేశారని, బాధిత వర్గాలకు న్యాయం చేయాలంటూ మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో బాధితలు అర్జీలు సమర్పించారు. బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన రాంబాబు అర్జీని సమర్పిస్తూ.. గ్రామంలో చెరువు పొరంబోకు భూమి 2.7 సెంట్ల భూమిని వైసీపీ నేతలు ప్లాట్లు వేసి విక్రయిస్తున్నట్టు పేర్కొన్నారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోని ప్రభుత్వ భూమిని కాపాడాలని, అది ప్రభుత్వ భూమిగా తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అనకాపల్లి జిల్లా రోలుగుంటకు చెందిన రమణరావు గ్రీవెన్స్‌లో అర్జీనిస్తూ.. తమకు పూర్వం పాస్ పుస్తకం ప్రకారం 1.84 ఎకరాల భూమి ఉంటే.. 1.49 ఎకరాలు ఆన్‌లైన్ అయ్యిందన్నారు. మిగిలిన 0.35 సెంట్లు భూమిని.. 'జగనన్న భూ-రీసర్వే' సమయంలో సర్వేయర్ తప్పుడు లెక్కలతో పక్కవాటాదారులకు కలిపేశాడని, దీనిపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. నెల్లూరు జిల్లా భైరవం గ్రామానికి చెందిన బట్టా నాగమ్మ గ్రీవెన్స్‌లో అర్జీనిస్తూ.. భారత మిలిటరీలో తన భర్త అందించిన సేవలను గుర్తించి.. 5 ఎకరాల భూమిని 'డి' ఫారం పట్టా కేటాయించారని, తమ భూమిపై కన్నేసిన దాసరి తిరుపతయ్య నకిలీ పత్రాలు సృష్టించి ఇబ్బంది పెట్టారని పేర్కొన్నారు. దీనిపై హైకోర్టును ఆశ్రయిస్తే.. తమకు అనుకూలంగా తీర్పు వచ్చినా రాజకీయ నేతల ఒత్తిడితో అధికారులు భూమిని కొలవడానికి రాలేదని, ప్రస్తుతం రెవెన్యూ రికార్డులలో 5 ఎకరాల భూమి 'ప్రభుత్వ భూమి'గా నమోదై ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని ఆసరా చేసుకుని రాజకీయ అండదండలతో తమ భూమిని కాజేయాలని తిరుపతయ్య మళ్లీ కుట్రలు పన్నుతున్నాడని, కబ్జాదారులపై చర్యలు తీసుకోని సమస్యను పరిష్కరించాలని కోరారు. కడపకు చెందిన గోపాల కృష్ణ, ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడు గ్రామానికి చెందిన మరియదాసు, విశాఖపట్నం జిల్లా గాజువాక మండలం తాలారివారిపాలెం గ్రామానికి చెందిన సంజీవరావు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చేజర్ల మండలం చలపనాయుడు పల్లి గ్రామానికి చెందిన కిలారి చంద్రమౌళి, మార్కాపురం జిల్లా కనిగిరి మండలం వంగపాడుకు చెందిన చిన్నమాలకొండయ్య, పల్నాడు జిల్లా ఉప్పరపాలెం గ్రామానికి చెందిన వెంకాయమ్మ, వైఎస్ఆర్ కడప జిల్లా వేంపల్లికి చెందిన కృష్ణవేణి, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం లక్కవరం గ్రామానికి చెందిన సత్యనారాయణ రాజు గ్రీవెన్స్‌లో అర్జీల సమర్పించారు. వీటితోపాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలిచ్చి పరిష్కరించాలని కోరారు. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని, ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు. అర్జీలను స్వీకరించిన మంత్రి సంధ్యారాణి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ శ్రీదేవి.. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

# బీసీ హాస్టళ్లు బేష్

- ఐవీఆర్ఎస్ సర్వేలో టాప్ ప్లేస్
- సంక్షేమ హాస్టళ్లలో 78.20 శాతంతో అగ్రస్థానం
- విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయ సేకరణలో వెల్లడి
- కూటమి రాకతో బీసీ బిడ్డల చదువుకు ప్రాధాన్యం
- ఎప్పటికప్పుడు డైట్, కాస్మోటిక్ బిల్లుల మంజూరు
- విద్యార్థుల ఆరోగ్య, ఆహార భద్రతకు పెద్దపీట
- ఎఫ్ఆర్ఎస్‌తో ఏడాదిలో రూ.6 కోట్ల ఆదా
- సత్ఫలితాలిచ్చిన ఆకస్మిక తనిఖీలు, సమీక్షలు



అమరావతి (చైతన్య రథం): కూటమి ప్రభుత్వం రాకతో బీసీ బిడ్డల విద్యకు ఆసరాగా నిలిచే హాస్టళ్లు మెరుగైన పనితీరుతో ముందంజలో నిలుస్తున్నాయి. మౌలిక సదుపాయల కల్పన, ఆరోగ్యకరమైన మెనూ, బోధనలతో రాష్ట్ర స్థాయిలో బీసీ హాస్టళ్ల అగ్రగామిగా నిలిచాయి. పరిశుభ్రమైన వాతావరణం, పరిశుద్ధమైన తాగునీటి కల్పన, ఆరోగ్యభద్రతతో కూడిన విద్యను అందించడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల మనస్సును బీసీ హాస్టళ్లు గెలుచుకున్నాయి. హాస్టళ్ల నిర్వహణపై ప్రభుత్వ ఐవీఆర్ సర్వేలో మిగిలిన సంక్షేమ హాస్టళ్లకంటే బీసీ సంక్షేమ హాస్టళ్లు 78.02 శాతం సంతృప్త స్థాయిలతో ప్రథమ స్థానంలో నిలిచి ఔరా అనిపించుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 1110 బీసీ బాలుర, బాలికల హాస్టళ్లు ఉన్నాయి. గత ప్రభుత్వంలో బీసీ సంక్షేమ హాస్టళ్లు పూర్తిగా నిరాదరణకు గురయ్యాయి. నిధులు విడుదల చేయకపోవడంతో మరమ్మతులు సైతం నోచుకోలేకపోయాయి. కనీసం డైట్ బిల్లు కూడా చెల్లించకపోవడంతో బీసీ బిడ్డలు అర్ధాకలితో నరకం చూశారు. కాస్మోటిక్ ఛార్జీలు సైతం చెల్లించిన పాపానపోలేదు. దినదిన గండంగా ఆ అయిదేళ్లు బీసీ హాస్టళ్లలో చదివే విద్యార్థులు కాలం నెట్టుకొచ్చారు. కూటమి ప్రభుత్వం రాకతో ఇతర సంక్షేమ హాస్టళ్లతో పాటు బీసీ సంక్షేమ హాస్టళ్లకు మంచిరోజులు ప్రారంభమయ్యాయి. అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబునాయుడు బీసీ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ముందుగా బీసీ బిడ్డల ఆకలి తీర్చేలా రూ.110 కోట్ల మేర డైట్ బకాయిలను చెల్లించారు. నాటి నుంచి ఎప్పటికప్పుడు డైట్ బిల్లులు చెల్లిస్తూ వస్తున్నారు. కాస్మోటిక్ ఛార్జీలను సైతం విద్యార్థులకు సకాలంలో చెల్లిస్తున్నారు. 23 నెలల కాలంలో బీసీ హాస్టళ్ల మరమ్మతులు, ఇతర నిర్మాణాల కోసం రూ.100 కోట్లు వెచ్చించారు. రూ.2 కోట్లతో 104 హాస్టళ్లలో విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ అందజేయడానికి ఎస్.ఆర్. శంకరన్ రిసోర్స్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో బీసీ బిడ్డలు 85.99 శాతం ఉత్తీర్ణత సాధించారు.

**విద్యార్థుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట**

విద్యతోనే బీసీలను అన్ని రంగాల్లోనూ ప్రగతి సాధించగలరన్నది సీఎం చంద్రబాబు ఉద్దేశం. అందుకే బీసీ బిడ్డల విద్యకు, వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ బీసీ హాస్టళ్లలో మౌలిక సదుపాయల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. స్వచ్ఛ భారత్ మిషన్ లో భాగంగా 971కి పైగా మరుగుదొడ్ల నిర్మాణం విస్తృతంగా చేపట్టారు. ఇప్పటికే కొన్ని హాస్టళ్లలో నిర్మాణాలు పూర్తికాగా, మరికొన్నింటిలో మరో నెల రోజుల్లో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేయనున్నారు. అన్ని హాస్టళ్లలో పరిశుభ్రమైన తాగునీరు అందించడానికి రూ.21 కోట్లతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. దోమల నివారణే లక్ష్యంగా రూ.6 కోట్లు వెచ్చించి, అన్ని హాస్టళ్లలోనూ తలుపులకు, కిటికీలకు దోమ తెరలు ఏర్పాటు చేశారు. హాస్టళ్లలో నిరంతర విద్యుత్ సరఫరా చేసేలా రూ.20 కోట్లతో ఇన్వర్టర్లను ఏర్పాటు చేసింది. వంట పాత్రలు, ఇతర సామాగ్రి కోసం రూ.18 కోట్లు అందజేసింది. పౌష్టికాహారం అమలులో భాగంగా హాస్టల్ విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం అందిస్తున్నారు. మెనూ సక్రమంగా అమలు కోసం కుక్ లు, కమాటీలను ప్రభుత్వం ఇప్పటికే నియమించింది. హాస్టళ్లలో పరిశుభ్రత కోసం 1,291 పారిశుధ్య సిబ్బందిని త్వరలో నియమించడానికి చర్యలు చేపట్టింది. బీసీ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు ఆరోగ్య, ఆహార భద్రతతో కూడిన విద్య అందించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం.

**ఎఫ్ఆర్ఎస్‌తో రూ.6 కోట్ల ఆదా**

బీసీ హాస్టళ్లలో నిర్వహణలో పారదర్శకతను పెద్దపీట వేయసాగారు. విద్యార్థుల హాజరులో ఆరోపణలకు తావులేకుండా ముఖ ఆధారిత హాజరు(ఎఫ్ఆర్ఎస్)ను తీసుకొచ్చారు. ఇందులో భాగంగా హాస్టల్ సిబ్బందికి సైతం ఎఫ్ఆర్ఎస్ ను అమలు చేశారు. ఈ వ్యవస్థను అమలు చేయడంతో విద్యార్థుల హాజరు మెరుగవ్వడమే కాకుండా విధి నిర్వహణలో సిబ్బంది సమయపాలన పాటించ సాగారు. అన్నింటికంటే ముఖ్యంగా విద్యార్థుల మెనూకు అవసరమయ్యే నిత్యావసర సరుకుల దుర్వినియోగానికి అడ్డుకట్టపడింది. దీనివల్ల నెలకు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకూ, ఏడాదికి రూ.6 కోట్లకు పైబడి ఆదా అయ్యింది. ఎఫ్ఆర్ఎస్ విధానం మొట్టమొదటిసారిగా బీసీ హాస్టళ్లలో అమలు చేయడం విశేషం. హాస్టల్ సిబ్బందికి కేవలం ఆదేశాలతోనే సరిపెట్టకుండా, విధి నిర్వహణలో పారదర్శకత, పర్యవేక్షణ కోసం హెచ్.పి.టి.ఎస్. యాప్ ను కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా వార్డెన్లు, ఏబీసీడబ్ల్యూవోలు, డీబీసీడబ్ల్యూవోల పనితీరును ఈ యాప్ ద్వారా మరింత మెరుగుపరచడానికి వీలుకలిగింది. హాస్టళ్లలో మెనూ అమలు, పరిశుభ్రత, మరుగుదొడ్లు, తాగునీటి కల్పనపై ఏ రోజుకారోజు ఫొటోలను ఈ యాప్‌లో అప్ లోడ్ చేయాల్సి ఉంటుంది. దీనివల్ల హాస్టళ్లలో పరిస్థితులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అవకాశం రాష్ట్ర స్థాయి అధికారులకు కలిగింది.

**ఐవీఆర్ఎస్ సర్వేలో బీసీ హాస్టళ్లు టాప్**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీ హాస్టళ్ల ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించింది. రూ.వందల కోట్లు వెచ్చిస్తూ, విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు వసతి అందిస్తోంది. నిధులు విడుదలతోనే చేతులు దులుపుకోకుండా, అంతిమంగా విద్యార్థులకు ఫలాలు అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టింది. ఈ సర్వేలో భాగంగా నేరుగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి, బీసీ హాస్టళ్ల పనితీరుపై ఆరా తీయసాగింది. ఈ సర్వేలో మిగిలిన సంక్షేమ హాస్టళ్ల కంటే బీసీ హాస్టళ్ల నిర్వహణ భేషుగ్గా ఉన్నట్లు వెల్లడైంది. 2025–26 విద్యా సంవత్సరంలో రెండు పర్యాయాలు ఐవీఆర్ సర్వే ద్వారా ప్రభుత్వం తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించింది. గతేడాది డిసెంబర్ 26 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 26 వరకూ మొదట విడతగా, ఈ ఏడాది మార్చి 26 నుంచి ఏప్రిల్ 26 వరకూ రెండో విడతగా ఐవీఆర్ఎస్ సర్వేగా తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకుంది. హాస్టల్ నిర్వహణా తీరు ఎలాగుంది... వార్డెన్ల పనితీరు... మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా..? అని మూడు ప్రశ్నలకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సమాధానం రాబట్టారు. మొదటి విడత సర్వేలో 71.30 శాతం. రెండో విడతలో 78.20 శాతం మంది సంతృప్తి వ్యక్తంచేశారు. మిగిలిన సంక్షేమ హాస్టళ్లకంటే బీసీ హాస్టళ్ల నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రులిచ్చిన సంతృప్త స్థాయి అధికంగా ఉండడం విశేషం.

**మంత్రి సవిత నిరంతర పర్యవేక్షణతో సత్ఫలితాలు**

గత ప్రభుత్వంలో బీసీ హాస్టళ్లకు నిధులు మంజూరు చేయకపోవడమే కాకుండా పర్యవేక్షణకు సైతం నోచుకోలేకపోయాయి. జగన్ ప్రభుత్వంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రులు హాస్టళ్లను సందర్శించిన పాపానపోలేదు. మొక్కుబడిగా అయిదేళ్ల కేవలంలో ఒకట్రెండు హాస్టళ్లను సందర్శించి మమ అనిపించే శారు. కూటమి ప్రభుత్వం ఏర్పడడం, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఎస్.సవితకు సీఎం చంద్రబాబు నాయుడు బాధ్యతలు అప్పగించడంతో బీసీ హాస్టళ్ల దశ తిరిగింది. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హాస్టళ్లను మంత్రి సవిత సందర్శిస్తూ వస్తున్నారు. ఆకస్మిక తనిఖీలు చేస్తూ, నేరుగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని, అక్కడికక్కడే వాటికి పరిష్కారం చూపుతూ వస్తున్నారు. డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలతో తరుచూ సమీక్షా సమావేశాలు నిర్వహించి, మెనూ అమలు, హాస్టళ్ల అభివృద్ధి, విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధతపై దిశానిర్దేశం చేయసాగారు. అటు కూటమి ప్రభుత్వం, ఇటు మంత్రి సవిత నిరంత పర్యవేక్షణతో టెన్త్, ఇంటర్ లో బీసీ హాస్టళ్ల విద్యార్థులు అత్యుత్తమ పలితాలు సాధించారు.

## మెరుగైన రోడ్లు కూటమి లక్ష్యం

**ప్రొద్దుటూరులో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**



ప్రొద్దుటూరు (చైతన్యరథం): ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యతగా ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రొద్దుటూరు పట్టణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. శనివారం ప్రొద్దుటూరులో పలు అభివృద్ధి పనులకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పర్యటించిన మంత్రికి ఎమ్మెల్యే ఎన్ వరదరాజులురెడ్డి, స్థానిక కూటమి పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ప్రొద్దుటూరు–చాగలమర్రి రోడ్డు 1.9కి.మీమేర రూ.5.34 కోట్లతో 6 లేన్ల విస్తరణ పనులకు మంత్రి జనార్దన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మైపాడు –నెల్లూరు –బళ్లారి –బాంబే రోడ్డు (మైదుకూరు రోడ్డు) 1.2 కిలోమీటర్లు రహదారికి రూ.5 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రహదారుల అభివృద్ధికి సంబంధించి వచ్చిన పలు విజ్ఞప్తులను స్వయంగా స్వీకరించి, త్వరలో వాటిని అభివృద్ధి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## విశాఖకు సెమీ రింగ్ రోడ్

**రాంబిల్లినుంచి భోగాపురం వరకు 102కి.మీ మేర నిర్మాణం - వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌పై సమీక్షలో మంత్రి నారాయణ**




విశాఖపట్నం (చైతన్య రథం): రానున్న 50 ఏళ్లలో విశాఖ నగరాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సెమీ రింగురోడ్డు నిర్మిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ అన్నారు. రాంబిల్లినుంచి భోగాపురం వరకు 102 కి.మీమేర రింగు రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌పై మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి అధికారులతో నారాయణ సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "నగరం అభివృద్ధి చెందాలంటే మాస్టర్ ప్లాన్ అవసరం. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించాం. మాస్టర్‌ప్లాన్ అంశంలో వచ్చిన వినతులపై ఈ సమావేశంలో చర్చించాం. ఎమ్మెల్యేల నుంచి అందిన వినతుల్లో 90శాతం పరిష్కరించాం. 6,836 చదరపు కి.మీ పరిధిలో వీఎంఆర్డీఏ విస్తరించి ఉంది. ఈనెల చివరి నాటికి సెమీ రింగురోడ్డు డీపీఆర్ సిద్ధమవుతుంది. భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఏడు కనెక్టింగ్ రోడ్లను వీఎంఆర్డీఏ నిర్మిస్తోంది. ఇప్పటికే మూడు పూర్తయ్యాయి. భోగాపురం ఎయిర్‌పోర్టుకు బీచ్ కారిడార్ ప్రతిపాదన ఉంది. రూ.14వేల కోట్లతో తాగునీటి ప్రాజెక్టు వస్తోంది. ఇది పూర్తయితే 95 శాతం ఇళ్లకు తాగునీరు అందుతుంది" అని మంత్రి నారాయణ వివరించారు. మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ ఎకనామిక్ కారిడార్ ఆధారంగా సమీక్ష సమావేశం జరిగిందని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మారుతోందన్నారు. సమావేశంలో ఎంపీలు శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం తుది మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి ప్రజాప్రతినిధుల అభ్యంతరాలు, సూచనలను మంత్రి నారాయణ స్వీకరించారు. నియోజకవర్గాల వారీగా మాస్టర్ ప్లాన్‌పై అధికారులు సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు.

# నియోజకవర్గమే నా కుటుంబం



- రైతు బిడ్డగా అభివృద్ధికి నిధులు తెస్తున్నా
- వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం
- నియోజకవర్గ పర్యటనలో మంత్రి నిమ్మల
- రూ.8.34 కోట్లమేర శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

పాలకొల్లు (చైతన్య రథం): వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమేనని, నేడు 23 నెలల కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పాలకొల్లు నియోజకవర్గ ప్రజలంతా తన కుటుంబంగా భావించే.. నియోజకవర్గ అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తూ కోట్లాది రూపాయలు నిధులు తెస్తున్నట్టు ఉద్ఘాటించారు. పాలకొల్లు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రూ.8.25 కోట్లతో 14 అభివృద్ధి పనులకు కూటమి నేతలతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఆయా గ్రామాల్లో మంత్రి నిమ్మలకు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహిళలు పూలవర్షం కురిపించారు. పూలపల్లి గ్రామంలో రూ.3.7 కోట్లతో పూలపల్లి -ఆగర్తిపాలెం ఆర్ అండ్ బి రహదారి అభివృద్ధి పనులకు, ఆగర్రు గ్రామంలో రూ. 37.7 లక్షలతో పాత నెం.3 కాలువ గట్టుపై గ్రావెల్ రోడ్ నిర్మాణ పనులకు, రూ.30 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులకు, 25 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు, మరో 9 లక్షలతో రెవెన్యూ బోధిపై గ్రావెల్ రోడ్ నిర్మాణ పనులకు, 37.6 లక్షలతో జున్నూరు కాలువకు సీసీ వాల్ నిర్మాణ పనులకు, 49.20 లక్షలతో ఆగర్రు నుండి చిటివానిగరువు వరకు సీసీ వాల్ నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేశారు. వెలివెలలో 73.7 లక్షలతో జున్నూరు కాలువపై ఎస్ఎల్ఆర్ వంతెన నిర్మాణం పనులకు, 23.50 లక్షలతో జున్నూరు కాల్వకు సీసీ వాల్ నిర్మాణ పనులకు, 21 లక్షలతో జున్నూరు కాలువ గట్టుపై గ్రావెల్ రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆగర్తిపాలెంలో 15.5 లక్షలతో మామిడిగుంట నందు అంగన్‌వాడి భవనం, రూ.92 లక్షలతో తాగునీటి పనులను ప్రారంభించారు. సగంచెరువు గ్రామంలో రూ.8.01 లక్షలతో గోరింటాడ చిన్న కాలువ గట్టుపై గ్రావెల్ రోడ్ నిర్మాణ పనులకు, గోరింటాడ గ్రామంలో రూ.32.40 లక్షలతో పీనుగులకోడు చిన్న కాలువ, రెవెన్యూ కాలువ గట్టుపై గ్రావెల్ రోడ్ నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేశారు. అనంతరం గోరింటాడ గ్రామంలో జరిగిన బహిరంగ సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను చెప్పుకొచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో పాలకొల్లు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు డిసిసిబి, డీసీఎంఎస్, టీటీడీ బోర్డు సభ్యుడు, జడ్పీ చైర్మన్ వంటి పదవులు అనుభవించారేగాని అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. అటువంటి పార్టీకి, ఆ నాయకులకు ఓటు వేయడం దండగన్నారు. రైతు బిడ్డగా రైతుల కష్టం తెలిసినవాడిగా పంట కాలువలు, మురుగు డ్రైన్ల వెంబడి గ్రావెల్ రోడ్లకు పెద్దఎత్తున నిధులు తీసుకువచ్చి నిర్మిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ నిధులే కాకుండా సిఎస్ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి పనులతోపాటు నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా సైకిల్ అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. పనిచేసే మంచి కూటమి ప్రభుత్వాన్ని, మంచి నాయకుడిని ఆశీర్వదిస్తే అభివృద్ధి సంక్షేమం మరో 15 ఏళ్లపాటు కొనసాగుతుందన్నారు. భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా కూటమి పార్టీ బలపరిచిన అభ్యర్థులను ఏకగ్రీవంగా గెలిపించాలని మంత్రి నిమ్మల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ కోడి విజయ భాస్కర్, ఉన్నమట్లకబర్ది ఎంపీటీసీ గెడ్డం కుటుంబరావు, మామిడిశెట్టి లలితకుమారి, మండేల పావని, మండెల మధుర మీనాక్షి, మండెల త్రిమూర్తులు, కావలి లక్ష్మికుమారి, సాధనల దుర్గబాబు, వాసమహేష్, పాముల రజనికుమార్, మేడిది జాన్ రాజు తదితరులు, బూత్ కన్వీనర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# విధ్వంసంనుంచి వికాసవైపు పాలన

- భయపెట్టే రాజకీయాలు ముగిసిపోయాయి..
- భరోసా కలిగించే పరిపాలన సాగుతోంది
- వైసీపీ హయాంలో సమస్యలు చెప్పుకోవడానికే భయపడ్డారు
- నేడు ప్రజలకు అందుబాటులో ప్రభుత్వం పనిచేస్తోంది
- వైజాగ్ అంటే ఒకప్పుడు గంజాయి గుర్తొచ్చేది..
- నేడు గూగుల్, టీసీఎస్ వంటి సంస్థలు గుర్తుకొస్తున్నాయి
- మీడియా సమావేశలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు ప్రశాంత వాతావరణం, భరోసానిచ్చే పాలన అందుతోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గారు పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికే భయపడే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. నేడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను నేరుగా పరిష్కరించే ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రతిరోజూ మంత్రుల బృందం నిత్యం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరిస్తోందన్నారు. ప్రారంభంలో వేల సంఖ్యలో వచ్చిన ఫిర్యాదులు, సమస్యల పరిష్కారంతో క్రమంగా తగ్గాయని చెప్పారు. ప్రజల ఎదుటనే కలెక్టర్లు, జేసీలు, అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గాలు చూపించడం చంద్రబాబు నాయుడు గారి పరిపాలనా దృక్పథానికి నిదర్శనమన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి కంటే అరాచకాలకు, కబ్జాలకు ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. రుషికొండను ధ్వంసం చేసి భారీ ఖర్చుతో నిర్మాణాలు చేపట్టారని, రాష్ట్ర ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. ఉత్తరాంధ్రలో ఒకప్పుడు గంజాయి మాఫియా విస్తరించి యువత భవిష్యత్తును నాశనం చేసిందని, నేడు కూటమి ప్రభుత్వ చర్యలతో పరిస్థితులు పూర్తిగా మారాయని పేర్కొన్నారు. అరకు, పాడేరు ప్రాంతాల్లో గంజాయి తోటల స్థానంలో కాఫీ తోటలు విస్తరిస్తున్నాయని తెలిపారు. గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఉత్తరాంధ్రలో ఒక దళిత యువకుడిని హత్య చేసి డోర్ డెలివరీ పేరుతో మృతదేహాన్ని తరలించిన దారుణ ఘటన వైసీపీ పాలనలో చోటుచేసుకుందని, అదే ఉత్తరాంధ్రలో కరోనా సమయంలో మాస్క్ అడిగిన పాపానికి ఓ దళిత డాక్టర్‌పై దాడులు జరిగి, చివరకు ఆయన ప్రాణాలు కోల్పోయే పరిస్థితికి వైసీపీ తెచ్చిందని, అలాంటి అరాచక ఘటనలు గత పాలనలో శాంతిభద్రతల పరిస్థితికి ప్రతిబింబలాన్ని దుయ్యబట్టారు. వైజాగ్ అంటే ఒకప్పుడు గంజాయి గుర్తొచ్చేదని, ఇప్పుడు గూగుల్, టీసీఎస్ వంటి అంతర్జాతీయ సంస్థలు గుర్తుకొస్తున్నాయని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో మంత్రి నారా లోకేష్ గారి పాత్ర కీలకమని చెప్పారు. విశాఖలో భారీ పెట్టుబడులతో టీసీఎస్ సంస్థ రావడం ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయని తెలిపారు. అనకాపల్లిలో అర్సెలార్ సంస్థ ప్రాజెక్ట్ ద్వారా కూడా పెద్ద ఎత్తున ఉపాధి లభించనుందని పేర్కొన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణాన్ని పూర్తి చేసి అల్లూరి సీతారామరాజు పేరుతో జాతికి అంకితం చేశామని తెలిపారు. ఉత్తరాంధ్రకు రైల్వే జోన్ సాధించడం కూడా కూటమి ప్రభుత్వ గొప్ప విజయమన్నారు. రైల్వే జోన్ ద్వారా ఉత్తరాంధ్రలో పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. సుజల స్రవంతి వంటి ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించి తాగునీరు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో సాగునీటి ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణలో కూడా కూటమి ప్రభుత్వం కీలకంగా వ్యవహరించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో వేల కోట్ల రూపాయల నిధులు సమకూర్చి ఉక్కు ఫ్యాక్టరీని లాభాల బాటలో నడిపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. గత పాలనలో ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని, ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారాయని అన్నారు. అమరావతి నిర్మాణంపై విమర్శలు చేసే వారికి రైతుల త్యాగం అర్థం కాదన్నారు. 33 వేల మంది రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చి రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు వేశారని తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి సంధ్యారాణి గారు స్పష్టం చేశారు. ప్రజలు విధ్వంస రాజకీయాలను తిరస్కరించి భారీ మెజార్టీతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని, రాబోయే రోజుల్లో కూడా అభివృద్ధి, సంక్షేమం ద్వారానే ప్రజల మద్దతు పొందుతామని విశ్వాసం వ్యక్తం చేశారు.

# విజయవాడలో 13న 'ఎస్ఎంఈ ఐపీవో' సదస్సు

- ఎంఎస్ఎంఈలకు పెట్టుబడి మార్కెట్లపై అవగాహనే లక్ష్యం
- ఎంఎస్ఎంఈ అభివృద్ధి సంస్థ -నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సంయుక్తంగా ఆతిథ్యం
- చిన్న పరిశ్రమలకూ ఇక స్టాక్ మార్కెట్ దన్ను
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి



అమరావతి (చైతన్యరథం) రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పెట్టుబడి మార్కెట్లపై అవగాహన కల్పించేందుకు, ఏపీ ఎంఎస్ఎంఈ అభివృద్ధి సంస్థ - నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సంయుక్తంగా విజయవాడలోని హోటల్ నోవాటెల్‌లో ఈనెల 13న బుధవారం ప్రత్యేక అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగాగా ఐటీ మంత్రి నారా లోకేష్, నరసారావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు పాల్గొంటారన్నారు. సదస్సు నేపథ్యంలో మంత్రి కొండపల్లి స్పందిస్తూ భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల స్థితిగతులను మార్చేందుకు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తన ప్రత్యేక వేదిక 'ఎన్ఎస్ఈ ఎమర్జ్' ద్వారా సరికొత్త విప్లవానికి నాంది పలికిందన్నారు. ఈ అంశంలో టీడీపీ పార్లమెంటరీ పక్షనేత, నరసారావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు కీలక పాత్ర పోషించారన్నారు. ఇకపై ఎంఎస్ఎంఈలు నిధుల సమీకరణకు కేవలం బ్యాంకులపైనే ఆధారపడకుండా, స్టాక్ మార్కెట్ ద్వారా ఈక్విటీ మూలధనాన్ని సేకరించే అద్భుత అవకాశాన్ని వేదిక కల్పిస్తోందని మంత్రి పేర్కొన్నారు. సాధారణంగా చిన్న పరిశ్రమలకు వడ్డీభారం పెద్ద సవాలుగా మారుతుందని... అయితే 'ఎన్ఎస్ఈ ఎమర్జ్' ద్వారా కంపెనీలు రిటైల్, సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి ఈక్విటీ సేకరించవచ్చన్నారు. దీనివల్ల వడ్డీలేని పెట్టుబడి లభించడమే కాకుండా, కంపెనీ 'డెట్-ఈక్విటీ' నిష్పత్తి మెరుగుపడి, భవిష్యత్తులో క్రెడిట్ రేటింగ్ పెరగడానికి దోహదపడుతుందని మంత్రి తెలిపారు.

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్ట్ అవ్వడం ద్వారా సంస్థలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుంది. ముఖ్యంగా "వేస్ట్-టు-వెల్త్" వంటి వినూత్న సాంకేతికతలతో పనిచేసే స్టార్టప్‌లకు, ఎంఎస్ఎంఈ పార్కులలోని యూనిట్లకు ఇది అద్భుతమైన వరం అని, ఇది కేవలం నిధులనే కాకుండా, పారదర్శకమైన యాజమాన్య పద్ధతులను, మెరుగైన బ్రాండ్ విలువను అందిస్తుందని మంత్రి చెప్పారు. ఈ విధానంలో మెయిన్ బోర్డ్ కంపెనీల్లాగా ప్రతి మూడు నెలలకు కాకుండా, ఆరు నెలలకు ఒకసారి ఆర్థిక నివేదికలు సమర్పించే వెసులుబాటు ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.



*జాతీయ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో పాల్గొన్న నాయకులకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. నాయకుల నుంచి బ్లడ్ శాంపిల్స్ సేకరించి వైద్య బృందం వివిధ రకాల పరీక్షలు చేపట్టింది.నాయకుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, ఆరోగ్యవంతమైన నాయకత్వమే సమర్థవంతమైన ప్రజాసేవకు పునాది అన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.నేడు మొత్తం 167 మంది నాయకుల నుంచి బ్లడ్ శాంపిల్స్ సేకరించి ఆరోగ్య పరీక్షలు పూర్తి చేశారు.*

చైతన్యరథం

## ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ దిశగా

# విద్యారంగంలో సంస్కరణలు



- పాఠశాల విద్యలో సమస్యలు గుర్తింపు
- అక్కడి నుంచే సంస్కరణల అమలు
- పునాది దశ అభ్యసనాలు మెరుగుపరిచేందుకు ప్రణాళికలు అమలు
- G-FLN, TaRLతో ప్రాథమిక విద్యలోనే బలమైన పునాది
- ఫ్యాన్సీ విద్యా విధానాల జోలికి వెళ్లని మంత్రి నారా లోకేష్

**గా**లిలో మేడలు కట్టొద్దు అని హితవు చెప్పే పెద్దలు నేలపై నిలబడమంటారు. సవాళ్లతో కూడిన విద్యా శాఖను చేపట్టిన నారా లోకేష్ గాలిలో మేడలు కట్టే యంత్రాంగానికి అసలు మన విద్య ఎక్కడుందో చూడండి అంటూ ఆదేశాలిచ్చారు. విదేశాల్లో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని విదేశాల్లోనే వరల్డ్ బ్యాంకులో ఉన్నత ఉద్యోగం చేసిన లోకేష్.. విద్యా శాఖలో ఫ్యాన్సీ విదేశీ విద్యా విధానాలు అమలు చేయాలని యత్నించలేదు. గత పాలకుల మాదిరిగా టోఫెల్, ఐబీ అంటూ నేల విడిచి సాము చేయలేదు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే , Annual Status of Education Report (ASER) నివేదికల మేరకు విద్యార్థుల్లో కనీస అభ్యసనా సామర్థ్యాలు లేవని గుర్తించారు. వాటిని పెంపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

### దేశంలోనే తొలిసారిగా... గ్యారెంటీడ్ FLN

భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్ లోని 38,391 ప్రాథమిక పాఠశాలల్లో గ్యారెంటీడ్ ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (G-FLN) అమలు ఆరంభించారు. ప్రతి విద్యార్థికీ బలమైన పునాది అభ్యసనాలు ఒత్తిడితో కాదు... ఉల్లాసంతో, ఆటపాటలతో మొదలవ్వాలి. అందుకే మన ప్రభుత్వ పాఠశాలల్లో 1, 2 తరగతుల విద్యార్థుల కోసం గ్యారెంటీడ్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (G-FLN) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. మన ప్రాథమిక పాఠశాలల్లో అడుగుపెడితే విద్యార్థులు పుస్తకాల్లోని అంశాలను బట్టీ పట్టడం కాకుండా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, ఎడ్యుటైన్‌మెంట్ యాక్టివిటీస్ వంటి, బాలా ఫీచర్స్ వంటి బోధన ద్వారా ఎంతో సరదాగా, ఆహ్లాదకరంగా, ఆనందంగా, ఆడుతూ పాడుతూ నేర్పుతున్నారు. చిత్రాల ద్వారా అక్షరాలు నేర్చుకోవడం, ఆటల ద్వారా అంకెలు లెక్కించడం వంటి పద్ధతుల ద్వారా తెలుగు, ఇంగ్లీష్ భాషలను బోధిస్తున్నారు. జ్ఞానజ్యోతి, జ్ఞానప్రకాశ్ వంటి మాడ్యూల్స్ ద్వారా విద్యార్థులు ప్రతి అక్షరాన్నీ, ప్రతి శబ్దాన్నీ అనుభూతి చెందుతూ నేర్చుకుంటున్నారు. పెద్ద తరగతులకు వెళ్లే వరకు వేచి చూడకుండా మొదటి నుంచే పునాదిని బలంగా నిర్మించడం గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ప్రత్యేకత. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలకు అనుగుణంగా వారి స్థాయిని అంచనా వేసి తదనుగుణంగా పాఠ్య ప్రణాళిక సిద్ధం చేశారు. రెగ్యులర్ క్లాసులు పూర్తయిన తర్వాత మధ్యాహ్నం 1 గంట నుంచి 3.30 గంటల వరకు రెమెడియల్ సెషన్స్ కొనసాగిస్తున్నారు.

### సులభతర బోధనకు... బోధనాభ్యసన సామగ్రి పంపిణీ

ఆంధ్రప్రదేశ్‌లో గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం, సమగ్ర శిక్షా పాఠశాలలకు, విద్యార్థులకు వివిధ రకాల బోధనా సామగ్రిని అందజేశాయి. 2025-26 విద్యా సంవత్సరంలో సరఫరా చేసిన వస్తువుల వివరాలు ఇక్కడ ఉన్నాయి:

**అభ్యాస కిట్లు** (Learning Kits)

1. జాదూయ్ పిటారా (Jaadui Pitara): ఇది ఆటల ద్వారా నేర్చుకోవడానికి రూపొందించిన ఒక మ్యాజిక్ బాక్స్ వంటి కిట్. ఇందులో ఆటబొమ్మలు, పజిల్స్, ఫ్లాష్ కార్డ్‌లు, కృత్యాధార బోధన కోసం అవసరమైన 62 వస్తువులు ఉంటాయి. ఇది రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12,000 పాఠశాలలకు అందించబడింది.

2. ఎఫ్ఎల్ఎన్ లెర్నింగ్ కిట్లు: స్కూల్ కాంప్లెక్స్ ద్వారా మిగిలిన 26,391 పాఠశాలలకు పంపిణీ చేశారు. ప్రాథమిక విద్యార్థుల్లో భాషా, గణిత సామర్థ్యాలను పెంచడానికి ఇవి ఉపయోగపడతాయి.

3. ఎఫ్ఎల్ఎన్ ప్రింట్ రీచ్ మెటీరియల్: పాఠశాలల్లోని తరగతి గదులను అభ్యసన కేంద్రాలుగా మార్చడంలో ప్రింట్ రీచ్ మెటీరియల్ (Print-Rich Material) కీలక పాత్ర పోషిస్తుంది. ఇది విద్యార్థులు తమ చుట్టూ ఉన్న వాతావరణం ద్వారా సహజంగా భాషను, అక్షరాలను నేర్చుకోవడానికి తోడ్పడుతుంది. ఎఫ్ఎల్ఎన్ (FLN) అమలులో భాగంగా వర్ణమాల, గుణింతాలు, సంఖ్యలు, కీలక పదాల చార్టులు, నిత్యం కొత్త పదాలను ప్రదర్శించే వర్డ్‌వాల్, బొమ్మల కథల పుస్తకాలు, ఫ్లాష్ కార్డ్స్ కలిగిన రీడింగ్ కార్నర్స్, తరగతి గదిలోని వస్తువులకు బైలింగువల్ లేబులింగ్, విద్యార్థుల సృజనాత్మకతను చాటే వర్క్ డిస్‌ప్లే, బొమ్మలతో కూడిన సూచన బోర్డులను ప్రభుత్వం అందించింది. ఈ మెటీరియల్ ద్వారా విద్యార్థులు



ఖాళీ సమయంలో కూడా నిరంతరం నేర్చుకుంటూ చదువు పట్ల భయాన్ని వీడి పఠనాసక్తి పెంపొందించుకుంటారు.

4. BaLA (Building as a Learning Aid) ఫీచర్లు: పాఠశాల భవనాన్ని కేవలం నాలుగు గోడల నిర్మాణంగా కాకుండా ఒక సజీవ బోధనా సాధనంగా మార్చడమే BaLA అసలు ఉద్దేశం. ఈ విధానం విద్యార్థుల విభిన్న అభ్యసన శైలులకు అనుగుణంగా ఉంటూ చూసి నేర్చుకునే వారికి ఆకర్షణీయమైన చిత్రాలను, చేసి నేర్చుకునే వారికి నేలపై ఇంటరాక్టివ్ ఆటలను అందిస్తుంది. దీనివల్ల నెమ్మదిగా నేర్చుకునే పిల్లలు సైతం ఎలాంటి ఒత్తిడి లేకుండా విషయాలను సులభంగా అవగాహన చేసుకుంటారు. గోడలపై ఉండే సైన్స్ రేఖాచిత్రాలు లేదా స్థానిక మ్యాపులు పిల్లల్లో చక్కని జిజ్ఞాసను రేకెత్తించి పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా స్వతంత్రంగా ఆలోచించేలా ప్రేరేపిస్తాయి. చదువును నిజ జీవితంతో, స్థానిక సంస్కృతితో అనుసంధానించడం ద్వారా అభ్యసనం మరింత అర్థవంతంగా మారుతుంది.

5. చైల్డ్ ఫ్రెండ్లీ ఫర్నిచర్: కొన్ని ఎంపిక చేసిన పాఠశాలలకు విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చుని కృత్యాలు చేయడానికి అనువైన ఫర్నిచర్ ఇచ్చారు.

6. అవుట్ డోర్ ప్లే మెటీరియల్: శారీరక వికాసం, ఆటల ద్వారా అభ్యసనానికి కావాల్సిన వస్తువులను సరఫరా చేశారు.

**వర్క్‌బుక్స్, మెటీరియల్** (75-Day Action Plan)

గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన 75 రోజుల యాక్షన్ ప్లాన్ బుక్స్ అందించారు.

స్థాయిల వారీ పుస్తకాలు: విద్యార్థుల స్థాయిని బట్టి స్ట్రీమ్ (Stream), మౌంటైన్ (Mountain), స్కై (Sky) అనే మూడు స్థాయిల్లో విడివిడిగా యాక్టివిటీ షీట్లు, మెటీరియల్ ఇచ్చారు.

– ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్స్: 1 & 2 తరగతులకు ఒకటి, 3 నుంచి 5 తరగతులకు మరొకటి చొప్పున టీచర్లకు గైడ్ బుక్స్ అందజేశారు.

### డిజిటల్, సాంకేతిక పరికరాలు

స్మార్ట్ టీవీలు & IFP ప్యానెల్స్: తరగతి గదుల్లో ఆడియో-విజువల్ బోధన కోసం వీటిని ఉపయోగిస్తున్నారు.

QR కోడ్‌లు: పాఠ్య పుస్తకాల్లో, ఎఫ్ఎల్ఎన్ మెటీరియల్లో ఉన్న క్యూఆర్ కోడ్‌ల ద్వారా డిజిటల్ పాఠాలను చూసే వెసులుబాటు కల్పించారు.

ORF App: విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని (Oral Reading Fluency) అంచనా వేయడానికి, డేటాను రికార్డ్ చేయడానికి ఉపాధ్యాయులకు ఈ యాప్ అందుబాటులో ఉంది.

ఇవన్నీ విద్యార్థులు కేవలం బట్టీ పట్టకుండా, కృత్యాధార పద్ధతిలో (Activity-based Learning) భాషను, గణితాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడతాయి. తద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మౌఖిక భాషా అభివృద్ధి (ఓరల్ లాంగ్వేజ్ డెవలప్‌మెంట్), అక్షరాలను గుర్తించి చదవడం, ధారాళంగా చదవడం, అవగాహనతో చదవడం, రాత నైపుణ్యం, నంబర్ సెన్స్ & బేసిక్ ఆపరేషన్స్ (సంఖ్యా జ్ఞానం, మౌలిక గణితం వంటివి నేర్చుకోవడానికి సులభతరమవుతుంది.

Teaching at the Right Level (TaRL)

రాష్ట్రంలో ఉన్న అన్ని 3, 4, 5 తరగతుల విద్యార్థుల కోసం Teaching at the Right Level (TaRL) కార్యక్రమం ద్వారా G-FLN అనుసంధానంతో పిల్లల సామర్థ్యం మేరకే బోధన చేస్తున్నారు. మొత్తం ప్రాథమిక పాఠశాలలకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కిట్స్ అందజేశారు.

### 9వ తరగతికి రెడీనెస్ ప్రోగ్రాం

పదో తరగతికి చేరే 9వ తరగతి విద్యార్థుల కోసం రాష్ట్రవ్యాప్తంగా సెకండరీ, హైస్కూళ్లలో రెడీనెస్ ప్రోగ్రాం అమలు చేస్తున్నారు. పదో తరగతికి 9వ తరగతి నుంచే విద్యార్థులను సిద్ధం చేసే ఒత్తిడి లేని స్నేహపూర్వక విద్యా బోధనతో రెడీనెస్ ప్రోగ్రాం రాష్ట్రవ్యాప్తంగా అమలవుతోంది.

### 10వ తరగతికి 100 డేస్ యాక్షన్ ప్లాన్

పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు '100 రోజుల కార్యాచరణ ప్రణాళికను మంత్రి నారా లోకేష్ అమలు చేశారు. 2025 డిసెంబరు 6 నుంచి 2026 మార్చి 15 వరకు పకడ్బందీగా అమలు చేసిన ఈ ప్రణాళికలో విద్యార్థులపై ఒత్తిడి లేకుండా 46 స్లిప్ టెస్టులు నిర్వహించారు. వచ్చిన మార్కులను 'లీప్' మొబైల్ యాప్‌లో నమోదు చేసి, ప్రతిరోజూ ఆకె డ్యాష్‌బోర్డ్‌ల ద్వారా విశ్లేషించారు. స్లిప్ టెస్టుల్లో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా వారిని 'షైనింగ్ స్టార్స్', 'రైజింగ్ స్టార్స్'గా గుర్తించారు. వారి సామర్థ్యాలకు అనుగుణంగా ప్రత్యేక బోధన అందించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. విద్యా శాఖ ప్రత్యేకంగా మోడల్ పేపర్లు, క్వశ్చన్ బ్యాంకులను ఉచితంగా అందించింది. ముఖ్యంగా నాన్-లాంగ్వేజ్ సబ్జెక్టుల కోసం ద్విభాషా (బై-లింగ్యువల్) పద్ధతిలో, ఒకవైపు తెలుగు మరోవైపు ఇంగ్లీషులో ప్రశ్నపత్రాలు రూపొందించి ఇవ్వడం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడింది. డ్యాష్ బోర్డ్ విశ్లేషణ ద్వారా విద్యార్థుల బలాబలాలకు అనుగుణంగా ప్రతి పాఠశాలకు 15 కార్యాచరణ ప్రణాళిక పుస్తకాలను పంపిణీ చేశారు. స్లిప్ టెస్టుల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం 30 రోజుల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌ను ప్రత్యేకంగా నిర్వహించి వారిపై దృష్టి సారించారు. పరీక్షల ఒత్తిడిని తగ్గించేందుకు ప్రీ-ఫైనల్, గ్రాండ్ టెస్టులు నిర్వహించారు.

పునాది దశలోనే సమస్యల మూలాలు తెలుసుకుని వాటిని అధిగమించేందుకు కృషి చేస్తూ, ప్రభుత్వ విద్యార్థులకు కావాల్సిన బోధన, బడిలో సౌకర్యాలు, నిపుణులైన ఉపాధ్యాయుల నియామకం వంటి వాటిపై దృష్టి సారించారు. దీంతో సత్ఫలితాలు వస్తున్నాయి.





**దుత్తలూరి శశికుమార్**
తెలుగుదేశం సైనికుడు

## అత్యంత వైభవంగా త్రిశూల్ ప్రారంభోత్సవం

- **ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడిన కైలాసగిరి**
- **విశాఖ పర్యాటకానికి సరికొత్త చిరునామాగా త్రిశూల్**



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ పర్యాటక మణిహారమైన కైలాసగిరి నూతనంగా ఏర్పాటు చేసిన 65 అడుగుల డమరుకంతో కూడిన త్రిశూల్ ప్రారంభోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం కైలాసగిరిపై మహా శివుడుకి ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం త్రిశూలంకు పూజలు చేశారు. రాష్ట్ర మున్సిపల్ మరియు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ, సెర్ప్, ఎన్.ఆర్.ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్, విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు విష్ణు కుమార్ రాజు, వంశీ కృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, బండారు సత్యనారాయణ మూర్తి, లోకం నాగ మాధవి, వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ భరత్ తదితరులు పాల్గొని త్రిశూల్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యాటకానికి పెద్దపీట వేస్తున్నారని, పర్యాటకం ద్వారా ఆదాయం రావటమే కాకుండా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కైలాసగిరి ఒక పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేయటం జరిగిందన్నారు. 65 అడుగుల ఎత్తున త్రిశూల్‌ను ఏర్పాటు చేసిన వి.ఎం.ఆర్డీ.ఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్‌ని, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్, వీఎంఆర్డీఏ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... విశాఖ నగరాన్ని అత్యున్నత నగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎనలేని కృషి చేస్తున్నారని, వేల కోట్లు పెట్టుబడులు తీసుకువస్తున్నారు అని పేర్కొన్నారు. త్రిశూల్ అనేది వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ కల అని, అది ఈరోజు సాకారమైందన్నారు. కైలాసగిరిపై ఈ రోజు ప్రారంభించిన త్రిశూల్ విశాఖ పర్యాటకానికి చిహ్నంగా నిలుస్తుందన్నారు. విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్ మాట్లాడుతూ... కైలాసగిరిపై నలుమూలల నుంచి కనిపించేలా ఏర్పాటుచేసిన త్రిశూల్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందన్నారు. కైలాసగిరి నీ మరింత అభివృద్ధి చేసేలా మాస్టర్ ప్లాన్ రూపొందించటం కోసం సన్నాహాలు చేస్తున్నామన్నారు. గాలుల తీవ్రతను తట్టుకునేలా త్రిశూల్ నిర్మాణం జరిగిందన్నారు.

**వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ...** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో విశాఖను పర్యాటక హబ్ తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగా 65 అడుగుల డమరుకంతో కూడిన త్రిశూల్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. కైలాసగిరి నీ కేవలం పర్యాటక ప్రాంతంగానే కాకుండా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా త్రిశూల్ ప్రాజెక్ట్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే కైలాసగిరిపై శివ పార్వతుల విగ్రహాలు పర్యాకులను ఆకర్షిస్తున్న నేపథ్యంలో మహా శివుని ఆయుధం త్రిశూల్‌ను హనుమంతవాక వ్యూ పాయింట్ వద్ద మరింత పర్యాటక చిరునామాగా త్రిశూల్ నిలుస్తుందన్నారు.



## బస్సు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తాం

- **బస్సు ప్రమాదాలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి**
- **క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**



రంపచోడవరం (చైతన్యరథం): బస్సు ప్రమాద ఘటనలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి సూచించారు. భద్రాచలం నుండి కాకినాడ వెళ్తున్న బస్సు చిన్న గెద్దాడ వద్ద శనివారం ప్రమాదానికి గురైంది. సంఘటన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి హుటాహుటీన రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రికి చేరుకున్నారు. క్షతగాత్రులను ఆమె పరామర్శించారు. గాయపడ్డ వారిని పరామర్శించిన ఆమె... వైద్యం అందుతున్న తీరుపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఎలాంటి మెరుగైన వైద్యం అవసరం అయితే రాజమండ్రి, కాకినాడ రిఫర్ చేయాలని సూచించారు. ప్రమాద ఘటనపై స్థానిక పోలీసులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యసేవల్లో ఎలాంటి జాప్యం లేకుండా సక్రమంగా వైద్య సేవలు అందించాలని కోరారు.

## విధ్వంసం నుంచి వికాసం వైపు ఏపీ : మంత్రి గుమ్మిడి



సాలూరు (చైతన్యరథం): విధ్వంస పాలన నుంచి వికాస పాలన వైపు రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకెళ్తున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... 23 నెలల కూటమి పాలనలో భయపెట్టే రాజకీయాలకు ముగింపు పలికి, భరోసా కలిగించే పరిపాలన అందుతోందన్నారు. వైసీపీ హయాంలో ప్రజల సమస్యలు చెప్పుకోవడానికే భయపడేవారని.. నేడు ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. వైజాగ్ అంటే ఒకప్పుడు గంజాయి గుర్తొచ్చేదని.. నేడు గూగుల్, టీసీఎస్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలు గుర్తుకొస్తున్నాయని మంత్రి అన్నారు. అరకు, పాడేరు ప్రాంతాల్లో గంజాయి తోటల స్థానంలో కాఫీ తోటలు విస్తరిస్తున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్రకు రైల్వే జోన్ సాధించడం కూటమి ప్రభుత్వ చరిత్రాత్మక విజయంగా చెప్పుకొచ్చారు. యువత చేతిలో ఆయుధాలు కాదు.. ఉద్యోగాలు, నైపుణ్యాలు, అవకాశాలు ఉండాలనేదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడం రాష్ట్ర చరిత్రలో గొప్ప సంఘటనన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కేంద్ర సహకారంతో వేల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని సంధ్యారాణి అన్నారు. గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపట్టామని తెలిపారు. జగన్‌కు ఇంట్లో వారిపైనే గౌరవం లేదని.. ఇక ప్రజలపై గౌరవం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. అధికార దాహం కోసం యువత చేతికి కత్తులు, గొడ్డళ్లు ఇచ్చే వైసీపీ నేతల మోసపూరిత మాటలకు బలికావొద్దని.. కోడికత్తి శ్రీను ఉదంతాన్ని గుర్తు తెచ్చుకోవాలని సూచించారు. సూపర్ 6 పథకాలు గిరిజనులకు ఎంతగానో తోడ్పడుతున్నాయని మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే బోనెల



పార్వతీపురం (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే తన అజెండా అని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వ హించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి, అక్కడికక్కడే కొన్నింటికి పరిష్కార మార్గాన్ని చూపారు. మరికొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

**దేవాలయాల నిర్మాణానికి నిధులు**

దేవాలయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. కొత్తవలస గ్రామంలోని రామాలయం నిర్మాణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జీర్ణ దేవాలయాల పునరుద్ధరణకు కంకణం కట్టు కుందన్నారు. అందులో భాగంగా ఈ గ్రామానికి ప్రభుత్వం రూ.40లక్షలు నిధులు మంజూ రు చేసిందని తెలిపారు. యాదవు కులస్తులు తమ కుల దైవమైన శ్రీకృష్ణ మందిరం నిర్మించుకోవడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. దీంతో పాటు బలిజిపేట మండలం గళావల్లి, పార్వతీపురం మండలం దుక్కువాని వలసల లో కూడా నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయని వివరించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రౌతు వేణుగో పాల్ నాయుడు, భోగి శంకరరావు, జి.వెంట నాయుడు, గోపీనాధ్ పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో ఫలిస్తున్న విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సంస్కరణలు

- **పది, ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్**



గాజువాక (చైతన్యరథం): రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేపట్టిన విద్యా సంస్కరణలు క్షేత్రస్థాయిలో ఫలితాలు ఇస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు పోటీ పెరిగిందని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'నో వెకెన్సీ' బోర్డులు కనిపించడం ఈ మార్పుకు నిదర్శనమని, కార్పొరేట్ విద్యాసంస్థల ఆధిపత్యానికి చెక్ పెడుతూ, సామాన్యుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంలో విద్యాశాఖ సాధించిన ఈ విజయం రాష్ట్ర విద్యా చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తోందని పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇటీవల జరిగిన ఇంటర్మీడియట్ మరియు పదవ తరగతి పరీక్షలలో రాష్ట్ర స్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ కళాశాల మరియు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచడం గర్వకారణమని పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల కోసమే ప్రజాదర్బార్ : మ్మెల్యే మామిడి

పాతపట్నం (చైతన్యరథం): నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఈ మేరకు తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. బోరుభద్ర–శివరాంపురం గ్రామాల మధ్య బీటీ రోడ్ నిర్మించాలని బోరుభద్ర మాజీ సర్పంచ్, మాజీ వైస్‌సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. రోడ్‌కు ఇరువైపులా రక్షణగోడ నిర్మించాలని గ్రామంలోగల ఎర్రచెరువు, కంసాలి చెరువులకు మెట్లు మంజూరీ చేయాలని కోరారు. పేదలు, సన్నకారు రైతులకు చెందిన బూరగాంలోని షుగర్ ఫ్యాక్టరీ భూములకు అక్రమంగా మ్యుటేషన్ చేయించి కొంతమంది కాజేయాలని చూస్తున్నారని, దీనిని అడ్డుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆ గ్రామస్థులు కోరారు.

## డెహ్రాడూన్లో అనకాపల్లికి చెందిన ఆర్మీ జవాన్ మృతి



అనకాపల్లి (చైతన్యరథం): అనకాపల్లి మండలం వెంకుపాలేనికి చెందిన ఆర్మీ ఉద్యోగి రాపేటి పూర్ణ చంద్రశేఖర్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. డెహ్రాడూన్లో శుక్రవారం రాత్రి విధి నిర్వహణలో ఉండగా.. బలమైన ఇనుప రాడ్డు మీదపడి తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ.. జవాన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. డెహ్రాడూన్ నుంచి స్వగ్రామానికి జవాన్ చంద్రశేఖర్ మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు చేస్తున్నారు. జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ భీమరశెట్టి రామకృష్ణ, జనసైనికులు వెంకుపాలెం గ్రామానికి చేరుకుని జవాన్ కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

# ఎండల నుంచి రిలీఫ్... మేఘామృత వాతావరణం

అమరావతి (చైతన్యరథం): ఎండవేడిమి, ఉక్కబోతతో ఇబ్బందులు పడుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఊరట కలిగించే వార్త వినిపించింది. ఆదివారం రోజున ఏపీలోని పలు జిల్లాలలో పిడుగులతో కూడిన వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని వెల్లడించింది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. వానలకు తోడుగా అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి, పోలవరం జిల్లాలోని గుర్తేడు, అనకాపల్లి జిల్లాలోని కె. కోటపాడు మండలాల్లో తీవ్రవడగాలులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. అలాగే అల్లూరి జిల్లా ముంచింగిపుట్టు, అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం, బీడికాడ, చోడవరం, దేవరపల్లి, మాడుగుల, పరవాడ మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఉరుములతో కూడిన వర్షం పడే సమయంలో.. పొలాల్లో పని చేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో ఉండొద్దని.. సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**బంగాళాఖాతంలో అల్పపీడనం**

మరోవైపు మే 12 లేదా13వ తేదీ నాటికి నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని స్కైమెట్ తెలిపింది. ఈ అల్పపీడనం తర్వాత వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని అంచనా వేసింది. అలాగే కర్ణాటక, రాయలసీమ ద్రోణి విస్తరించి ఉందని.. దీని ప్రభావంతో మంగళవారం వరకూ రాష్ట్రంలో మేఘావృత వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెప్తున్నారు.

# రాజోలు నియోజకవర్గంలో వైసీపీకి ఎదురు దెబ్బ : టీడీపీలో 30 కుటుంబాలు చేరిక



మలికిపురం (చైతన్యరథం): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలంలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మండలంలోని 75, 90, 97, 118 బూత్‌లకు చెందిన 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి గొల్లపల్లి అమూల్య కండువాలు కప్పి సాదర స్వాగతం పలికారు. ఫోకస్ బూత్ అబ్జర్వర్ చిలువూరి సతీష్‌రాజు (తెలుగు యువత జిల్లా ప్రెసిడెంట్), మిద్దె ఆదినారాయణ (గౌడ వెల్ఫేర్ డెవలప్మెంట్ డైరెక్టర్), టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అడబాల సాయి, ప్రధాన కార్యదర్శి గోనిపాటి రాజు, రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు రాజు, కడలి రమేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాపాక నవరత్నం, కాకి లక్ష్మణ్, గ్రామ శాఖ అధ్యక్షుడు జంపన సత్యనారాయణరాజు, బూత్ ఇన్‌చార్జిలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఉర్దూ భాషాభివృద్ధికి కృషి... 'ఆవో ఉర్దూ సిఖో" కార్యక్రమం ప్రారంభం

- ఉర్దూకు పరోపకారి సీఎం చంద్రబాబు నాయుడు
- ఎమ్మెల్యే నసీర్, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ సిబ్లీ



గుంటూరు (చైతన్యరథం): ఉర్దూ భాషను నేర్చుకోవాలనుకునే విద్యార్థులు, యువతలో ఆసక్తి పెంచేందుకు "ఆవో ఉర్దూ సిఖో" కార్యక్రమం చేపట్టినట్లు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీస్ ఛైర్మన్ నసీర్ అన్నారు. అందులో భాగంగా శనివారం స్థానిక పాత గుంటూరు జామియా మిస్బా హుల్ హుదా నందు పుస్తకాల పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ భాష అభివృద్ధికి ప్రభుత్వం ఉర్దూ సాంస్కృతిక కార్యక్రమాలు, భాషా శిక్షణ శిబిరాలు, ఉర్దూ అకాడమీ కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఉర్దూ భాషాభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. దీని ద్వారా ఉర్దూ అక్షరాల బోధన, మాట్లాడే విధానం, ఉర్దూ కవిత్వం, సాహిత్య పరిచయం, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. మదరసాలో విద్యార్థులకు సైతం సమ్మర్ క్యాంప్ ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కేంద్రం నుంచి ప్రధాన మంత్రి జనవికాస్ యోజన పథకానికి రూ.250 కోట్లు మంజూరైతే, యూసీలు అందించకుండా, మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా నిరుపయోగం చేశారన్నారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్ సిబ్లీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో చరిత్రలో ఎన్నడూలేని విధంగా లిటరీ కమిటీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దీని కోసం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉర్దూ భాషాభివృద్ధికి పరోపకారిగా ఉన్నారని తెలిపారు. రానున్న రోజుల్లో ఉర్దూకు సంబంధించి కంప్యూటర్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు.

# లబ్ధిదారులకు రూ.77.47 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

- గన్నవరం నియోజకవర్గంలో అందజేసిన విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని నిరుపేదలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు శనివారం లబ్ధిదారులకు అందజేశారు. గన్నవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 123 మంది లబ్ధిదారులకు రూ.77,47,637 విలువైన చెక్కులను ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో గత సార్వత్రిక ఎన్నికల సమయంలో పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించినట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు నుంచి పెండింగ్‌లో ఉన్న 55 మంది లబ్ధిదారులకు కూడా ఈరోజు చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. గన్నవరం మండలానికి చెందిన 43 మందికి రూ.21,55,315, బాపులపాడు మండలానికి చెందిన 30 మందికి రూ.19,04,665, ఉంగుటూరు మండలానికి చెందిన 13 మందికి రూ.8,88,701, విజయవాడ రూరల్ ప్రాంతానికి చెందిన 35 మందికి రూ.27,42,596, ఇతర ప్రాంతాలకు చెందిన ఇద్దరికి రూ.56,360 మొత్తాన్ని పంపిణీ చేసినట్లు వివరించారు. నియోజకవర్గంలో పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం పీహెచ్‌సీ, సీహెచ్‌సీ కేంద్రాల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు : హోంమంత్రి వంగలపూడి అనిత



విజయవాడ (చైతన్యరథం): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించేందుకు విజయవాడలోని ఎస్ఎల్వీ గ్రీన్ విల్లాస్ ప్రారంభించిన మొబైల్ వెహికల్‌ను రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆహార స్వయం సమృద్ధి సాధనలో ప్రకృతి వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పరిమిత వనరులతోనే ఇతర దేశాలు మిద్దె తోటల ద్వారా గణనీయమైన దిగుబడులు సాధిస్తున్నాయన్నారు. ఏపీలో ఉన్న సహజ వనరులను సమర్థంగా వినియోగిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. విజయవాడ వంటి పట్టణ ప్రాంతాల్లో నైట్ ఫుడ్ కోర్టుల ద్వారా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రతిపాదనను మంత్రి ప్రస్తావించారు. ఇటువంటి వినూత్న కార్యక్రమాల ద్వారా రైతులకు భరోసా కలగడమే కాకుండా, ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రస్తావించిన మంత్రి.. ప్రతి ఒక్కరూ సహజ సాగు వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఇటువంటి సానుకూల మార్పులు రాష్ట్ర ప్రగతికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

# వ్యక్తికన్నా వ్యవస్థ ముఖ్యం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

- ప్రభుత్వ విద్యలో నవశకం ప్రారంభమైంది



రాజమహేంద్రవరం (చైతన్యరథం): అమలు చేస్తున్న పథకాల్లో వ్యక్తిగత ప్రచారం కంటే వ్యవస్థ బలోపేతంపైనే కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటి పేర్లు పెట్టడం ద్వారా విద్యా విలువలను ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఫోటోలు ప్రధాన పత్రికల్లో ప్రచురించడం ద్వారా ప్రభుత్వ విద్య ప్రతిష్ఠ పెరిగిందన్నారు. సిటీ నియోజకవర్గ పరిధిలోని నగరపాలక సంస్థ పాఠశాలల్లో చదివి పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు ఘన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌కేవీటీ కళాశాల ఆవరణలోని ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ప్రతిభ కనబరిచిన ప్రతి విద్యార్థి రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రుల త్యాగం, ఉపాధ్యాయుల కృషి, పాఠశాల సిబ్బంది సేవలు కీలకమని కొనియాడారు. "ఎన్ని ఇబ్బందులు ఉన్నా పిల్లల విద్యను ఆపకుండా ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కష్టపడుతున్న తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు. అల్లరి పిల్లలను మంచి మార్గంలో నడిపించి విజయం సాధించేలా చేసిన ఉపాధ్యాయులకు నా వందనాలు" అని అన్నారు.

**మున్సిపల్ స్కూళ్లలో పెరుగుతున్న ఫలితాలు**

గత ఏడాది రాజమహేంద్రవరం మున్సిపల్ పాఠశాలల నుంచి 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థుల సంఖ్య 188 కాగా, ఈ ఏడాది అది 233కు పెరిగిందని ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్యే తెలిపారు.

**విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం**

"ఇప్పుడే మీ భవిష్యత్తుకు పునాది వేసుకునే సమయం... మంచి స్నేహితులను ఎంచుకోండి... తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే మాట వినండి... మొబైల్ ఫోన్ వినియోగాన్ని తగ్గించండి" అంటూ విద్యార్థులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సూచించారు.

**రాష్ట్రంలో భారీ పరిశ్రమలు -- యువతకు ఉద్యోగ అవకాశాలు**

రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల్లో భారీ పెట్టుబడులు వస్తున్నాయని ఎమ్మెల్యే వాసు తెలిపారు. విశాఖపట్నంలో గూగుల్ ఏఐ, టీసీఎస్ వంటి సంస్థలు రావడం, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి కంపెనీలు పెట్టుబడులు పెట్టడం వల్ల రానున్న సంవత్సరాల్లో యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

**కార్పొరేట్ కళాశాలల్లో చదివే అవకాశం**

మున్సిపల్ పాఠశాలల్లో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో తక్కువ ఫీజులతో ఇంటర్ చదివే అవకాశాన్ని రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ గతంలో ప్రారంభించిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు గుర్తుచేశారు. 2007--12 కాలంలో తన తల్లి అప్పటి మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ ఆధ్వర్యంలో ఈ పథకం ప్రారంభమైందని గుర్తు చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**●నందిగామలో ప్రజాదర్బార్ చేపట్టిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



నందిగామ (చైతన్యరథం): నందిగామ పట్టణం కాకాని నగర్‌లోని కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక మరియు పరిపాలనా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడిన ఎమ్మెల్యే సౌమ్య సమస్యలను శ్రద్ధగా విని సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజాదర్బార్ కార్యక్రమానికి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే నేరుగా విని స్పందించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

## కొండ ప్రాంతాల ప్రజలకు అండగా ఉంటాం

**●విజయవాడ కొండ ప్రాంతాల ప్రజలకు ఎంపీ కేశినేని శివనాథ్ శుభవార్త**

**●మూడు నెలల్లో కొండ పోరంబోకు ప్రాంతాల్లో స్థలాలు రెగ్యులరైజేషన్‌కు జిల్లా యంత్రాంగానికి కీలక ఆదేశాలు**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ కేశినేని శివనాథ్ కీలక ప్రకటన చేశారు. కొద్ది రోజుల కిందట జరిగిన ఎమ్మెల్యే ఎంపీస్ మీట్లో జీవో నెంబర్ 30 పై జరిగిన కీలక విషయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... ముందుగా విజయవాడ నగర వాసులు శుభవార్త తెలియజేశారు. కొద్ది రోజుల కిందట జరిగిన ఎమ్మెల్యే ఎంపీ ల సమావేశంలో జీవో నెంబర్ 30 ద్వారా 150 గజాల స్థలాన్ని రెగ్యులర్ చేయమని సీఎంను కోరినట్లు తెలిపారు. దీనికి సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందిస్తూ వెంటనే అధికారులకు సూచనలు చేయడం జరిగింది. మూడు నెలల్లోని కొండ ప్రాంతాల పోరంబోకు ప్రభుత్వ స్థలాల్లా నివాసం ఉంటున్న పేద ప్రజలకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ చేయమని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కొండ ప్రాంతాల్లో నివసించే వారు విజయవాడలో ఎక్కువగా తూర్పు నియోజకవర్గం పశ్చిమ నియోజకవర్గాల్లో ఎక్కువగా ఉన్నారని అలాంటి వారికి ఇది నిజంగా ఒక గొప్ప శుభవార్త అని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని ఇది చేతల ప్రభుత్వమని మరొకసారి నిరూపణ అయిందని ఎంపీ అన్నారు. ఎన్నో ఏళ్లుగా కొండ ప్రాంతాల్లో ఉన్న వారిని ఓటు బ్యాంకు గానే చూసిన పార్టీలు ఉన్నాయి కానీ వారిని ఆదుకున్నది మాత్రం కేవలం కూటమి ప్రభుత్వమేనని ఇది ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకోవాల్సిన విషయం అని ఎంపీ అన్నారు. త్వరలోనే 30 వేల మంది చిరకాల కోరిక సొంత ఇంటి కలను నెరవేర్చబోతున్నందుకు ఆనందంగా ఉందని తెలుపుతూ ప్రతి ఒక్కరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించాలి



పెదకూరపాడు (చైతన్యరథం): 80వ రోజు ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాలు కార్యక్రమాన్ని బెల్లంకొండ మండలం గంగిరెడ్డిపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు లింక్ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నియోజకవర్గంలో ఇప్పటికే 60శాతం రోడ్లను నిర్మించామన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని ముఖ్యమంత్రికి వివరిస్తామన్నారు. రానున్న రోజుల్లో గ్రామాలకు అవసరమైన నిధులను తెచ్చి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల వద్దకు ప్రవీణ్ 100రోజులు 100 గ్రామాలు కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమయం పట్టే సమస్యలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని సూచించారు. గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామంలో వీధి లైట్లు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని సూచించారు.

## అపరిమిత సంక్షేమం.. అవధుల్లేని అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

**●ఎన్డీయే ప్రభుత్వంలో చంద్రబాబు, పవన్, లోకేశ్ లే బెస్ట్ టీమ్**

**●వారి సమర్థతకు ప్రధాని సహకారం ఉన్నందునే వేగవంతమైన అభివృద్ధి**

**●పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): ప్రజలకు కోతల్లేని నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు.. అపరిమిత సంక్షేమం.. అవధుల్లేని అభివృద్ధితో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని, దేశాన్ని పాలిస్తున్న ఎన్డీయే ప్రభుత్వంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ లే తమ సమర్థతతో బెస్ట్ టీమ్ గా నిలిచారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శనివారం ఆయన యడ్లపాడు మండలంలో పర్యటించారు. తొలుత సొలస గ్రామంలో రూ.5 కోట్లతో నిర్మించతలపెట్టిన సబ్ స్టేషన్ నిర్మాణానికి, స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి, అనంతరం బోయపాలెంలో రూ.45 లక్షలతో నిర్మించనున్న విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. సొలసలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించిన తర్వాత మీడియావారితో మాట్లాడారు.

**విద్యుత్ సంస్కరణల అమలు... నాణ్యమైన విద్యుత్ అందించడంలో చంద్రబాబు దేశానికే మార్గదర్శి**

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నకూటమి ప్రభుత్వంలో నేడు ప్రజల సమక్షంలో ప్రధానమైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, జగన్ తన దురాశతో రాష్ట్ర విద్యుత్ రంగాన్ని భ్రష్టుపట్టిస్తే, చంద్రబాబు అనుభవంతో స్వల్పకాలంలోనే గాడిన పెట్టాడని ప్రత్తిపాటి తెలిపారు. 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన జగన్ ప్రజలపై భరించలేని విద్యుత్ ఛార్జీల భారం మోపితే.. ఇప్పటివరకు చంద్రబాబు ప్రజలపై రూపాయి భారం వేయకుండా విద్యుత్ వ్యవస్థను సంస్కరించాడన్నారు. విద్యుత్ సంస్కరణలు..వాటి అమల్లో చంద్రబాబు దేశానికే మార్గదర్శిగా నిలిచాడన్నారు. దేశంలోనే తొలిసారి ట్రూడౌన్ చేసిన ఘనత కూడా ఏపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రధాని మోదీ సహకారంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ లు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు.

**ఆరోగ్య అసమానతలు తగ్గించేందుకే విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం...**

నాణ్యమైన మెరుగైన వైద్యసేవల్ని పేదల ముంగిటకు చేర్చాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్ లకు శ్రీకారం చుట్టిందని ప్రత్తిపాటి చెప్పారు. వ్యాధుల నిర్ధారణ, తక్షణ చికిత్సలు.. అవసరమైన మందుల అందించడం, ఆరోగ్యంపై అవగాహన పెంచడమే ఈ క్లినిక్‌ల ఏర్పాటు వెనకున్న ప్రధానో ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు పట్టాలు జారీ చేయండి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**● మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేత**



గుంటూరు (చైతన్యరథం) వడ్డెర గూడెం, సుగాలీ కాలనీలలో ఆలయ భూములను క్రమబద్ధీకరణ చేసి పేద కుటుంబాలకు పట్టాల జారీ చేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కోరారు. శనివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆధ్యాత్మిక, సామాజిక మరియు పేద ప్రజల భూసంబంధిత సమస్యల పరిష్కారానికి సంబంధించిన వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.... గుంటూరు వడ్డెరగూడెంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి నగర సంఘానికి చెందిన సుమారు 120 వడ్డెర కుటుంబాలు దాదాపు 100 సంవత్సరాలకు పైగా ఆలయ భూమిలో నివసిస్తున్నప్పటికీ ఇప్పటికీ భూముల క్రమబద్ధీకరణ జరగక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 1970లో ఏర్పాటు చేసిన పునఃపరిశీలనా కమిటీ నిర్ణయాల ప్రకారం నివాసితులు భూమి విలువ చెల్లించినప్పటికీ, వివిధ సాంకేతిక కారణాల వల్ల ప్రక్రియ పూర్తి కాలేదని తెలిపారు. అనంతరం ఎండోమెంట్స్ కమిషనర్ ఆదేశాలు, హైకోర్టు ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ ఆదేశాలు వచ్చినప్పటికీ ఇంకా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఈ కుటుంబాలకు వీలైనంత త్వరగా పట్టాలు జారీ చేసి న్యాయం చేయాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు.

## క్రీడలతో శారీరక దృఢత్వం పాటు మానసిక ఉల్లాసం

**● యువత వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి**

**● క్రీడా శిక్షణ తరగతులకు జయప్రద ఫౌండేషన్ చైర్మన్ టీడీ జనార్ధన్ క్రికెట్ కిట్లు అందజేత...**



జగ్గయ్యపేట (చైతన్యరథం): నియోజకవర్గంలోని వత్సవాయి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రభుత్వం శాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ తరగతులకు జయప్రద ఫౌండేషన్ చైర్మన్ దశరథపు జనార్ధన్ క్రికెట్ కిట్లను అందించి యువతలో క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా జయప్రద ఫౌండేషన్ తరపున అందించిన క్రికెట్ కిట్లను కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని స్కూల్ విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ఆటల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కూడా పొందవచ్చని వారు పేర్కొన్నారు. అనంతరం క్రికెట్ మరియు కబడ్డీ క్రీడా మైదానాలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నెట్టెం రఘురాం, శ్రీరాం రాజగోపాల్ తాతయ్య విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థులు క్రీడల్లో మరింత ప్రతిభ కనబరచాలని ప్రోత్సహిస్తూ క్రీడాస్ఫూర్తిని పెంపొందించేలా వారితో మమేకమయ్యారు. యువత వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని క్రీడల్లో శిక్షణ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, కట్టా వెంకట నరసింహారావు, సొసైటీ చైర్‌పర్సన్‌లు తొండపు జగన్మోహనరావు, నెల్లూరు శ్రీనివాసరావు, కర్నాటి శంకర్రావు, ఏపూరి నాగశ్రీను, సత్తి బేతోలు, దొప్పలపూడి రామయ్య, ధూళిపాళ్ల లక్ష్మణరావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కణతాల రామకృష్ణ, పెద్ది రామారావు, ఉప్పగళ్ల రాధా, గద్దం నాగరాజు, చిట్టూరి రమేష్, చెన్న బాలకృష్ణ, నర్మనేని శ్రీనివాసరావు, దొడ్డ గోపాలరావు, కనతాల నారాయణ, వడ్లమూడి అజేష్, నెల్లూరు చిన్నశీను, బంధం నాగేశ్వరరావు తదితర నాయకులు, కార్యకర్తలు మరియు జయప్రద ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు

## ఎంపీ బీద మస్తాన్ రావుతో కలిసి ఎమ్మెల్యే సోమిరెడ్డి స్థల పరిశీలన



సర్వేపల్లి (చైతన్యరథం): కొడవలూరు మండలం రేగడిచెలిక వద్ద మహానాడు ఏర్పాట్లను సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఎంపీ బీద మస్తాన్ రావుతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లను వివరించిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మే 27, 28, 29 తేదీల్లో మహానాడు అంగరంగ వైభవంగా జరుగుతుందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా నెల్లూరులో మహానాడు నిర్వహిస్తుండటం ఆనందంగా ఉందన్నారు. ఇఫ్ కో కిసాన్ సెజ్ ప్రాంగణంలో చాలా విశాలమైన స్థలంలో భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. 200 ఎకరాలు సభా ప్రాంగణానికి, మరో 300 ఎకరాలు వాహనాల పార్కింగ్ కు సిద్ధమవుతున్నాయన్నారు. దశాబ్దాలుగా మహానాడుకు హాజరవుతున్నాం..నాంపల్లి గ్రౌండ్స్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ కు కార్యకర్తలతో కలిసి నడిచిపోయిన రోజులు ఇంకా గుర్తున్నాయన్నారు. నెల్లూరులో గతంలో అనేక సభలు నిర్వహించామని, మహిళా సదస్సు, సారా వ్యతిరేక ఉద్యమ సభతో పాటు అనేక ర్యాలీలు, సభలు విజయవంతంగా నిర్వహించామన్నారు. తొలిసారిగా మహానాడు నిర్వహించే అవకాశం వచ్చింది. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు నాయకత్వంలో చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు నభూతో నభవిష్యతిగా జరుగుతుందన్నారు. సభకు జరిగే ఏర్పాట్లుపై రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు 13వ తేదీన మహానాడు ప్రాంగణంలో కమిటీలతో సమీక్ష నిర్వహిస్తారన్నారు.




# అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో టీడీపీ శ్రేణులు చురుకైన పాత్ర పోషించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

శనివారం ఉదయం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు, కో-క్లస్టర్ ఇన్‌చార్జిలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా 'మై టీడీపీ' యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా నెల్లూరు రూరల్ నియోజ కవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను, ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాలను ఈ యాప్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. క్లస్టర్, డివిజన్ స్థాయి నాయకులు ప్రజలతో నిరంతరం మమేకమై, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వివరించాలని ఆదేశించారు.

# అధిక యూరియా అనర్థదాయకం

## ఇందూపూర్‌లో అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి




నెల్లూరు జిల్లా, అల్లూరు మండలం ఇందూపూర్ గ్రామ సచివాలయం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సమస్త సంస్థ (ఆత్మ) నిర్వహించిన "అధిక యూరియా, అనర్థదాయకం" అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. వివిధ పంటలలో యూరియా వినియోగం, దాని ప్రభావాలు, సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అధికారులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, రైతులు, మహిళా రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు, పంటల అవసరాలకు అనుగుణంగా ఎరువుల వినియోగం, అధిక యూరియా వాడకం వల్ల నేల సారవంతత తగ్గడం, పంటల నాణ్యత దెబ్బతినడం వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. అలాగే నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించడం, సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత, ప్రకృతి వ్యవసాయం అవసరాన్ని వివరించారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడుల కోసం అవసరానికి మించి యూరియాను వినియోగించడం వల్ల భవిష్యత్తులో భూముల ఉత్పాదకత దెబ్బతింటుందని అన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని సూచించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూరియా అధిక వినియోగం వల్ల భూమిలో పోషక సమతుల్యత దెబ్బతినడమే కాకుండా నీటి కాలుష్యం, పంటల నాణ్యత తగ్గుదల వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. సమతుల్య ఎరువుల వినియోగంతో పాటు సేంద్రియ ఎరువులను ప్రోత్సహించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులకు అవగాహన కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు పంటల సంరక్షణ, ఎరువుల వినియోగంపై నిపుణులు పలు సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులు కూడా ఇటువంటి అవగాహన కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని కోరారు.

# కార్పొరేట్‌కు ధీటుగా మల్లెల సంజీవయ్య స్కూల్ అభివృద్ధి

## మాజీ కార్పొరేటర్ కోటంరెడ్డి సంధ్య

నెల్లూరు (చైతన్యరథం): పేరు ప్రతిష్టల కోసం మల్లెల సంజీవయ్య స్కూల్ ను దత్తత తీసుకోలేదని.. కార్పొరేట్ స్కూల్ కి ధీటుగా అభివృద్ధి చేసేందుకే దత్తత తీసుకున్నానని నుడా చైర్మన్ కోటంరెడ్డి సతీమణి, మాజీ కార్పొరేటర్ సంధ్యా తెలిపారు. పదో తరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆమె ప్రోత్సాహకాలు అందజేశారు. 500 మార్కులు సాధించిన వారికి ఎస్బీకేఆర్ సేవా సమితి తరపున ప్రోత్సాహకాలు అందజేసి అభినందించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏసీ నగర్ లో ఉండే మల్లెల సంజువయ్య స్కూల్ తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. 60 లక్షలతో స్కూల్ని ఇప్పటికే అభివృద్ధి చేశామని.. మరో 40 లక్షలతో అభివృద్ధి చేసిన తర్వాత మంత్రి నారాయణకు స్కూల్ అప్పగిస్తామన్నారు. స్కూల్ అభివృద్ధికి అడిగిన వెంటనే నిధులు ఇచ్చిన ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీదా మస్త్రానావు రావ్ లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి నారా లోకేష్ ముందు చూపుతో స్కూల్స్ రూపు రేఖలు మారాయన్నారు.. "నా పిల్లలు చదివే సమయంలో ఈ స్థాయి వసతులు ఉంటే.. ప్రభుత్వ స్కూల్ లోనే చదివించే వాళ్ళమని ఆమె అన్నారు." పాత బిల్డింగ్ స్థానంలో కొత్త బిల్డింగ్ నిర్మిస్తామని ఆమె అన్నారు. భవిష్యత్తులో అర్బన్‌లో మల్లెల సంజీవయ్య స్కూల్ స్టూడెంట్స్ ప్రథమ స్థానంలో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఉత్తమమైన విద్యా బోధన వల్లే స్టూడెంట్స్ ఉత్తమ ఫలితాలు సాధించారని ఆమె అన్నారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు కష్టపడ్డా విద్యార్థులకు.. పరికి ఉత్తమ బోధనా అందించిన ఉపాధ్యాయులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆకుల హనుమంతరావు, పసుపులేటి మల్లికార్జున, సుభాన్ బాషా, శ్రీనివాసరావు, గౌసియా, నిర్మల్, రషీద్, అరుణ్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు



# 14న నెల్లూరు నారాయణలో మేగా జాబ్ మేళా

నెల్లూరు (చైతన్యరథం): ఈ నెల 14 వ తేదీన నెల్లూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో భారీ స్థాయి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. యువతలో నైపుణ్యాలు ఉన్నప్పటికీ సరైన అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని, అలాంటి యువతకు ఈ జాబ్ మేళా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం యువత ఉపాధి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, అందులో భాగంగానే ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాకు దేశవ్యాప్తంగా పేరొందిన ప్రముఖ సంస్థలు పాల్గొననున్నాయని కళాశాల మేనేజ్మెంట్ కార్యదర్శి వినయ్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా టీసీఎస్, టాటా గ్రూప్, టెక్ మహీంద్రా వంటి ప్రముఖ కంపెనీలతో పాటు సుమారు 30కు పైగా సంస్థలు హాజరై అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయని తెలిపారు. ఈ జాబ్ మేళాలో బి.టెక్, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ, డిప్లొమా, ఇంటర్మీడియట్, ఐటీఐ మరియు 10వ తరగతి పూర్తి చేసిన నిరుద్యోగ యువత పాల్గొనవచ్చని తెలిపారు. ఫ్రెషర్స్ తో పాటు అనుభవం కలిగిన అభ్యర్థులకు కూడా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు మరియు అప్డేటెడ్ రెజ్యూమ్ తో హాజరుకావాలని సూచించారు. ఎంపిక ప్రక్రియలో రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్ ,ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. జిల్లా లోని యువతతో పాటు పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు హాజరై ఈ మెగా జాబ్ మేళాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# వెండి రథంపై విహరించిన లక్ష్మమ్మ అవ్వ

## నలుమూలల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



ఆదోని (చైతన్యరథం): మహాయోగి లక్ష్మమ్మ అవ్వ రథోత్సవం శనివారం వైభవంగా సాగింది. 'లక్ష్మాంబికాదేవి నామస్మరణంతో ఆదోని పురవీధులు మార్మోగాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ ఉత్సవం ప్రారంభమైంది. పరిమళ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన వెండి రథంపై జగన్మాత భక్తులకు దర్శనమిచ్చారు. బ్రాహ్మణ వీధి నుంచి ప్రారంభమైన ఈ రథోత్సవం హవన్నపేట కూడలి, బుడేకల్ సర్కిల్, పూలబజార్, షరాఫ్‌బజార్ మీదుగా సాగింది. అడుగడుగునా భక్తులు అవ్వకు నీరాజనాలు అర్పించి, టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అవ్వ మూల బృందావనాన్ని రంగురంగుల పుష్పాలతో మనోహరంగా అలంకరించారు. ఉదయం 5 గంటల నుంచే జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అవ్వకు అభిషేకం, ఆకు పూజ, కుంకుమార్చన, బిల్వార్చన, మహామంగళహారతి వంటి విశేష పూజలు నిర్వహించారు. కొత్తగా పెళ్లయిన వందలాది జంటలు అవ్వ కలశాన్ని దర్శించుకోవడానికి పోటెత్తారు. ఎండ వేడి నుంచి భక్తులకు ఉపశమనం కలిగించేందుకు పట్టణమంతటా ఉచిత మజ్జిగ, నీళ్ల ప్యాకెట్లు సరఫరా చేశారు. వీటితో పాటు వివిధరకాల తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేసి పలువురు తమ భక్తిని చాటుకున్నారు. పట్టణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఎటుచూసినా జాతర కోలాహలమే కనిపించింది.

## ఎస్టీ జాబితా కోసం వాల్మీకుల పోరాటంలో

# తొలి అడుగు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మదే



ధర్మవరం (చైతన్యరథం): ఎస్టీ జాబితా కోసం వాల్మీకులు చేసిన పోరాటంలో అప్పట్లో తొలి అడుగు వేసింది రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మేనని ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం పట్టణంలోని ఎర్రగుంట సర్కిల్లో వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ పండుగ వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్‌తో పాటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జనసేన నేత చిలకం మధుసూదన్ రెడ్డి ఇతర ముఖ్య నాయకులు, వందల సంఖ్యలో వాల్మీకులు పాల్గొన్నారు. నాయకులతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం శ్రీరామ్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి ప్రజలకు ఒక అద్భుతమైన సందేశంతో కూడిన గ్రంథాన్ని అందించారన్నారు. కుటుంబ విలువలు, మనుషుల మధ్య సంబంధ బాంధవ్యాలు ఎలా ఉండాలన్నది రామాయణం ద్వారా చెప్పారన్నారు. ఇది కేవలం హిందువుల పవిత్ర గ్రంథం మాత్రమే కాదని.. ప్రతి మనిషి కచ్చితంగా చదివి, ఆచరించాల్సిన మార్గాన్ని సూచించిన పుస్తకమని అన్నారు. అలాంటి మహర్షి విగ్రహం ఒక ముఖ్యమైన కూడలిలో ఏర్పాటు చేయడం ద్వారా ఎంతో మందికి స్ఫూర్తిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ ఐక్యంగా నిర్వహించడాన్ని శ్రీరామ్ అభినందించారు. అంతా కలిసికట్టుగా పని చేస్తే ఆ కార్యక్రమం ఎలా ఉంటుందని చెప్పడానికి ఇదే ఒక ఉదాహరణ అన్నారు. బోయలతో తమ కుటుంబానికి ప్రత్యేకమైన అనుబంధం ఉందన్నారు. రాజకీయాల్లోనే కాకుండా గతంలో పరిటాల కుటుంబం చేసిన పోరాటంలో కూడా వాల్మీకులు తోడున్నారన్నారు. వారు తమ కుటుంబ సభ్యులు లాంటివారన్నారు. అందుకే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే పోరాటంలో తొలి అడుగు మంత్రిగా పరిటాల సునీతమ్మ వేశారన్నారు. అసెంబ్లీలో దీనిపై తీర్మానం ప్రవేశపెట్టి.. ఆ తర్వాత పార్లమెంట్ వరకు తీసుకెళ్లారన్నారు. ఇందులో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ నేటికీ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారన్నారు. ఒక రాష్ట్రంలో ఉన్న వాల్మీకులు ఒక్కో ప్రాంతంలో ఒక్కో జాబితాలో ఉండటం సరైంది కాదన్నారు. కచ్చితంగా వారిని ఎస్టీ జాబితాలో చేర్చేలా జరిగే పోరాటంలో తమ వంతు సహకారం ఉంటుందని శ్రీరామ్ స్పష్టం చేశారు.

# ఫలవంతమైన రారాజు మామిడి

నోరూరించే బంగినపల్లె మామిడి ప్రస్తుతం మార్కెట్లో లభ్యమవుతున్నాయి. ప్రజలు ఎంతో ఇష్టంగా ఈ పండ్లను ఆరగిస్తారు. బనగానపల్లె సంస్థానం అప్పట్లో నవాబుల పాలించారు. బనగానపల్లె నవాబు మీర్ గులాం అలీఖాన్(1908-1922) పరిపాలనా కాలంలో 1,500 ఎకరాల్లో మామిడి తోటను సాగుచేశారు. కొన్నిరోజులకే 3వేల ఎకరాల్లో బంగినపల్లి మామిడి సాగయ్యేది. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, వివిధ రకాల తెగుళ్లు మామిడికి వస్తుండడం , పంట సరిగా రాకపోవడంతో మామిడి తోటలను పంట భూములుగా రైతులు మార్చారు. బనగానపల్లెలో ప్రస్తుతం 450 ఎకరాల్లో సాగవుతోంది. బనగానపల్లె మామిడి కాలక్రమేణా బంగినపల్లిగా మారింది. ఇక్కడ నుంచి తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలకు ఈరకం సాగు విస్తరించింది. ఇక్కడి మామిడి పండ్లు దేశ, విదేశాలకు సైతం ఎగుమతి అయ్యేవి. ఒక్కో పండు రెండు కిలోల వరకు తూగుతుంది. ఏ మాత్రం పీచు లేకుండా పూర్తిగా గుజ్జు మాత్రమే ఉండటం దీని ప్రత్యేకత. వీటికి ఉన్న డిమాండ్ ఆసరాగా చేసుకుని వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి కాయలను దిగుమతి చేసుకుని బంగినపల్లి మామిడి పండ్లుగా విక్రయిస్తున్నారు.

### భౌగోళిక గుర్తింపు

బంగినపల్లి మామిడికి భౌగోళిక విశిష్ట గుర్తింపు 2017లో లభించింది. చెన్నైలోని ఐజీ రిజిస్ట్రీ ఓపీ గుప్తా దీనికి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేశారు. బంగినపల్లి మామిడి మధురమైన మామిడి పండ్లకు చిరునామా ఉంది.

### జిల్లాలో సుమారు 10వేల ఎకరాల్లో..

నంద్యాల జిల్లాలో సుమారు 10వేల ఎకరాల్లో బంగి నపల్లె మామిడి పంటను రైతులు సాగు చేస్తున్నారు. బనగానపల్లె మండలంలో 450 ఎకరాల్లో, బేతంచెర్ల మంలంలో 600 ఎకరాల్లో, ఓర్వకల్లులో 1111 ఎకరాల్లో, డోన్‌లో 2484 ఎకరాల్లో, ప్యాపిలిలో 805 ఎకరాల్లోను సాగు చేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే 60 శాతం కూడా మామిడి పంట రాకపోవడంతో పీకల్లోకి కష్టాల్లో మామిడి రైతు కూరుకుపోయారని చెప్పవచ్చు.

### తగ్గిన దిగుబడులు

ఈ ఏడాది వర్షాలు అనుకూలించినా మొగిలి దెబ్బతో పూత రాలిపోయి మామిడి పంట ఉత్పత్తి బాగా తగ్గిపోయింది. నవంబరులో తుపాన్ ప్రభావంతో పూత బాగా రాలిపోయింది. దీనికి తోడు తేనెమంచు పురుగు, బూడిద తెగుళ్ల వల్ల మామిడి ఉత్పత్తి తగ్గిపోయింది. తీవ్రమైన ఎండలకు, ఇటీవల భారీగా గాలులు వీచడంతో చాలా మామిడి కాయలు రాలిపోయాయి. మొగిలితో పూతలు రాలిపోవడం వంటి కారణాలతో ఈ ఏడాది మామిడి కాయల కాపు భారీగా తగ్గిపోయిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పెరిగిన ధరలు

పండ్లలో రారాజుగా పిలువబడే బంగినపల్లె మామిడి ధరలు ఈ ఏడాది పెరిగాయి. అందని ద్రాక్షలా మామిడి పండ్లు మారాయి. దిగుబడి తగ్గిపోవడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కిలో మామిడి మార్కెట్లో సైజును బట్టి రూ.100 నుంచి రూ.150 వరకు పలుకుతుంది. వంద మామిడి పండ్లు రూ.7వేలనుంచి రూ.8వేలకు అమ్ముడుపోతున్నాయి. అయినా కూడా ప్రజలు ఎంతో ఆసక్తితో ఈ పండ్లను కొనుగోలు చేసి తింటున్నారు.

### వ్యాపారుల మాయ

బంగినపల్లి మామిడి పండ్లకు గిరాకీ ఉండటంతో కొందరు వ్యాపారులు ప్రజలను మాయ చేస్తున్నారు. కృత్రిమ పక్వం చేసి ప్రజలను అనారోగ్యం పాలు చేస్తున్నారు. పసువు పచ్చ రంగులో అచ్చం మాగిన పండు లాగా కనిపించే ఈ కాయలు ఏమాత్రం రుచి లేకపోగా విష తుల్యంగా మారుతున్నాయి. కొందరు వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి పండ్లను తెప్పించుకుని బంగినపల్లి మామిడిగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.



# విలువలు తెలియని వింత జీవి జగన్‌రెడ్డి : మాజీ ఎమ్మెల్యే మేకపాటి ఎద్దేవా




ఉదయగిరి (చైతన్యరథం): మాజీ శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకపాటి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మమైన పసుపు పండగ మహానాడు. అలాంటి మహానాడు నెల్లూరు జిల్లాకి అవకాశం రావడం ,ఈనెల 27, 28, 29 తేదీలలో కోవూరు నియోజకవర్గంలోని, కొడవలూరు మండలం ఇస్కో కిసాన్ సెజ్ ప్రాంగణంలో మహానాడును చేయడానికి స్థానిక శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు రవిచంద్ర, జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అందరం కలిసి శభాష్ నెల్లూరు అనే విధంగా మహానాడు నిర్వహించబోతున్నామన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, లోకేష్, సారథ్యంలో సంక్షేమం, అభివృద్ధి దిశగా పరిపాలన సాగిస్తున్నారని, అల్లకల్లోలమైనటువంటి రాష్ట్రాన్ని గాడిని పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి కోసం పెట్టుబడులను తీసుకురావడం కోసం నిరంతరం లోకేష్ పని చేస్తున్నారన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విలువల లేని రాజకీయం చేశారన్నారు. నా గ్రాఫ్ బాగాలేదని చెప్పిన సజ్జల రామకృష్ణారెడ్డి, ధనుంజయ రెడ్డి లు జగన్మోహన్ రెడ్డి గ్రాఫ్ గురించి చెప్పి ఉంటే బాగుండేదని అన్నారు. నెల్లూరు జిల్లా అంటే పుచ్చలపల్లి సుందరయ్య, ఆనం సంజీవరెడ్డి, ఏసీ సుబ్బారెడ్డి, నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి మహానుభావులు హుందా రాజకీయం నడిపారు. రాష్ట్ర రాజకీయాలను తలకిందులు చేసేటువంటి జిల్లా నెల్లూరు. అలాంటి నెల్లూరు జిల్లాలో ఉన్నటువంటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి గౌరవ మర్యాదలు లేకుండా ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకుని ముఖ్యమంత్రి పైన, లోకేష్ పైన ఇష్టానుసారంగా మాట్లాడితే జగన్మోహన్ రెడ్డి దగ్గర మెప్పు పొందచ్చని ఏది పడితే అది విర్రవీగుతున్నారన్నారు. ఈ మధ్యనే ప్రెస్ మీట్ పెట్టి మహానాడు పెట్టిన, మినీ మహానాడు పెట్టిన నెల్లూరు జిల్లాలో 2029 ఎన్నికల్లో పదికి, పది సీట్లు గెలుస్తామని జోష్యం చెప్తున్నా అన్నారు. జగన్మోహన్ రెడ్డి కోసం ఊడిగం చేశామని నాకు పెద్ద కిరీటం పెట్టాడని, నీకు కూడా ఆ కౌరవ సర్వ పెడతాడు అని అన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని నువ్వు సన్నగా ఉన్నావు, నువ్వు బక్కగా ఉన్నావు, గాలి వస్తే ఎగిరిపోతావు ఇలాంటి పనికిమాలిన మాటలు మాట్లాడటం వలన లేదా నువ్వు లావుగా ఉన్నంత మాత్రాన ఏమి లాభం లేదు లావు సన్నం కాదు రాజకీయాల్లో కావాల్సింది సేవ. పద్ధతిగా మాట్లాడితే, గౌరవంగా మాట్లాడితే బాగుంటుందని అన్నారు. ప్రకృతిని కొల్లగొట్టి కోట్ల రూపాయలు దోచుకున్నారని, రాష్ట్ర రాజధాని గురించి ఒక స్టాండ్ లేని మీరు, అమరావతి గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. రాజశేఖర్ రెడ్డి గారి కుమారుడిగా ఆయన పుణ్యాన ముఖ్యమంత్రి అయ్యాడు, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజశేఖర్ రెడ్డి ఏం శేఖర్ అని ఎంతో గౌరవంగా పిలిచేవారని, జగన్మోహన్ రెడ్డి తండ్రికి తగ్గ తనయుడు కాదని ధ్వజమెత్తారు.

# ఉన్నత విద్యకు 'తానా' వారధి

**స్కాలర్‌షిప్ వెబినార్ విజయవంతం**
**కాలేజీలో చేరే విద్యార్థులకు విలువైన సూచనలు**


అమెరికా: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మిడ్ అట్లాంటిక్ విభాగం ఆధ్వర్యంలో కాలేజీలో చేరబోయే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం నిర్వహించిన 'తానా స్కాలర్‌షిప్ వెబినార్' విజయవంతంగా ముగిసింది. ఇందులో కాలేజీ అడ్మిషన్ల ప్రక్రియ, స్కాలర్‌షిప్ అవకాశాలపై విలువైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమానికి 'తానా' అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, బోర్డ్ డైరెక్టర్ రవి పొట్లూరి, మిడ్-అట్లాంటిక్ ప్రాంతీయ ప్రతినిధి ఫణి కంతేటి, బెనిఫిట్స్ కో-ఆర్డినేటర్ వెంకట్ సింగు, ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ వెంకటరావు అడుసుమల్లి సహకారం అందించారు.

ఉన్నత విద్య అవకాశాలపై ఆసక్తితో విద్యార్థులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు




భారీ సంఖ్యలో ఈ వెబినార్‌లో పాల్గొన్నారు. కళాశాల ప్రవేశాలు, స్కాలర్‌షిప్‌లు పొందే విధానాలు, విద్యార్థుల ప్రొఫైల్‌ను ఎలా బలపరుచుకోవాలనే అంశాలపై విలువైన సూచనలు అందించారు. వెబినార్‌కు హాజరైన వారికి అమెరికాలో కాలేజీ దరఖాస్తులకు ఉపయోగపడే స్కాలర్‌షిప్ గైడ్‌ను తానా నాయకులు అందజేశారు.

'తానా' బోర్డ్ డైరెక్టర్ రవి పొట్లూరి మాట్లాడుతూ.. 'భవిష్యత్తు విజయాలకు విద్య బలమైన పునాది. ఇటువంటి కార్యక్రమాల ద్వారా తదుపరి తరాన్ని నడిపించడం, ఉత్తేజపరచడం, సాధికారత కల్పించడానికి తానా ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది' అని స్పష్టం చేశారు. తమ నైపుణ్యంతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపి, వారి విద్యా లక్ష్యాల వైపు ప్రేరేపించిన కాలేజీ కౌన్సెలర్, అకడమిక్ కోచ్ జో కేతార్‌కు తానా నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.




# 17న వైద్య విద్యార్థులకు వెబినార్




కాలిఫోర్నియా: దక్షిణ కాలిఫోర్నియా తెలుగు సంఘం (TASC) 55వ వార్షికోత్సవ (ఎమరాల్డ్ జూబ్లీ) వేడుకల్లో భాగంగా వైద్య విద్యార్థుల కోసం ఒక ప్రత్యేక ఉచిత వెబినార్ నిర్వహిస్తోంది. MD vs DO: Your Journey to Becoming a Doctor అంశంపై కార్యక్రమం జరగనుంది.

వైద్య వృత్తి చేపట్టాలనుకునే విద్యార్థులకు అల్లోపతి (MD), ఆస్టియోపతిక్ (DO) మెడిసిన్ మధ్య ఉన్న వ్యత్యాసాలను, మెడికల్ స్కూల్ ప్రయాణాన్ని వివరించడమే ఈ సెషన్ ముఖ్యోద్దేశం.

తేదీ: మే 17, ఆదివారం
సమయం: సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు (PST)
వేదిక: జూమ్ మీటింగ్ (చిత్రంలోని క్యూఆర్ కోడ్ లేదా లింక్ ద్వారా జాయిన్ అవ్వచ్చు)

నిపుణులైన అమూల్య కులకర్ణి (లేక్ ఎరీ కాలేజ్ ఆఫ్ ఆస్టియోపతిక్ మెడిసిన్), దీక్ష పానుగంటి (కాలిఫోర్నియా నార్త్ స్టేట్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మెడిసిన్) విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తారు. మరింత సమాచారం కోసం 'టాస్క్' చైర్ వెంకట్ పెయ్యాల (310-427-0335) కో-చైర్ రాధా ఉప్పలపాటి (949-331-3275)లను సంప్రదించాలి. ఆసక్తి గల విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టాస్క్ కార్యవర్గ సభ్యులు కోరుతున్నారు.

## టెన్నెసీ తెలుగు సమితి ఆధ్వర్యంలో...

# 30న మెన్స్ పికిల్‌బాల్ టోర్నీ

బ్రెంట్‌వుడ్: క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడం, కమ్యూనిటీని ఏకం చేసే లక్ష్యంతో టెన్నెసీ తెలుగు సమితి (TTS) ప్రతిష్ఠాత్మకమైన 'మెన్స్ పికిల్‌బాల్ టోర్నమెంట్-స్ప్రింగ్ 2026' నిర్వహిస్తోంది.

తేదీ: మే 30
సమయం: ఉదయం 8 గంటలకు ప్రారంభం
వేదిక: విలియమ్సన్ కౌంటీ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (920 Heritage Way, Brentwood, TN 37027).

రిజిస్ట్రేషన్ వివరాలు:
ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే ఒక్కో టీమ్‌కు $40 ప్రవేశ రుసుముగా నిర్ణయించారు. పరిమితంగా ఉన్న స్థానాల (Spots) దృష్ట్యా ఆసక్తి గల వారు వెంటనే ఈ కింది లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.
https://tinyurl.com/TTSMPBS2026




మరిన్ని వివరాలకు విష్ణు (408-893-9751)ను సంప్రదించాలి. క్రీడాభిమానులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని టోర్నమెంటును జయప్రదం చేయాలని టెన్నెసీ తెలుగు సమితి ప్రతినిధులు కోరారు.




## గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్

# షార్లెట్ చాప్టర్ నూతన కార్యవర్గం

షార్లెట్: ప్రవాస తెలంగాణ సంస్థ గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ (GTA) తన షార్లెట్ చాప్టర్ కోసం నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. సంస్థ వ్యవస్థాపకుడు, అడ్వైజరీ చైర్ విశ్వేశ్వర్ కల్వల, గ్లోబల్ చైర్మన్ ప్రవీణ్ కేసిరెడ్డి, ప్రెసిడెంట్ బాపు ఆర్ కేతిరెడ్డి మార్గదర్శకత్వంలో ఈ నూతన కమిటీని ఎంపిక చేశారు.

**ఎగ్జిక్యూటివ్ కమిటీ**
**ప్రధాన ప్రతినిధులు:**
షార్లెట్ చాప్టర్ అధ్యక్షుడిగా శ్రీకర్ నాగుల బాధ్యతలు చేపట్టారు.
వైస్ ప్రెసిడెంట్: ప్రదీప్ వెన్నమనేని
జనరల్ సెక్రటరీ: భరత్ కుంభం
జాయింట్ సెక్రటరీ: సాయికిరణ్ నాయక్
ట్రెజరర్: రాజేందర్ చీటి
జాయింట్ ట్రెజరర్: శ్రీనివాస్ మద్దులపల్లి
సాంస్కృతిక విభాగం చైర్‌గా ప్రియాంక కోడటి, మీడియా విభాగం చైర్‌గా మౌనిక కొక్కిరాల, మార్కెటింగ్ విభాగం చైర్‌గా రవీందర్ కొనకటి, స్పోర్ట్స్ విభాగం చైర్‌గా శ్రీనాథ గద్దెతో పాటు మరికొందరు సభ్యులు వివిధ కమిటీలకు నాయకత్వం వహించనున్నారు.

సంస్థ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు వంశీ కేసిరెడ్డి, నర్సింగ్ పద్మ, రాజ్ పందిరిలతో కూడిన షార్లెట్ అడ్వైజరీ బోర్డును కూడా ఏర్పాటు చేశారు. షార్లెట్ పరిసర ప్రాంతాల్లోని తెలంగాణ సమాజాన్ని ఏకం చేస్తూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు చెప్పారు.

# 30న నార్త్ కరోలినాలో 'పల్లె వంట'

నార్త్ కరోలినా: ప్రవాస భారతీయులకు తెలంగాణ గ్రామీణ రుచులను, వారసత్వాన్ని పరిచయం చేసే లక్ష్యంతో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ రాలి చాప్టర్ ఆధ్వర్యంలో 'పల్లె వంట' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ నెల 30వ తేదీ శనివారం నార్త్ కరోలినాలోని అపెక్స్ నగరంలో ఈ వేడుక జరగనుంది. ఆ రోజు ఉదయం 11.30 గంటలకు ప్రారంభం అవుతుంది.

వేదిక: వైట్ ఓక్ రిక్రియేషన్ ఏరియా, వైట్ ఓక్ బీచ్ రోడ్, అపెక్స్, NC 27523

తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్వహించే ఈ కార్యక్రమంలో కుకింగ్ కాంపిటీషన్ (వంటల పోటీలు) ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. వీటితో పాటు వివిధ రకాల స్టాల్స్, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించనున్నాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాలకు www.gtaraleigh.org వెబ్‌సైట్‌ను సందర్శించగలరు.




## తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం నూతన కార్యవర్గ

# అధ్యక్షుడిగా డాక్టర్ భరత్ నరవెట్ల

అమెరికా: అమెరికాలోని ప్రవాస తెలంగాణ సంస్థ తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ (TDF) USA నూతన అధ్యాయాన్ని ప్రారంభించింది. సంస్థ ప్రెసిడెంట్ డాక్టర్ భరత్ నరవెట్ల నేతృత్వంలో 2026 సంవత్సరానికి సంబంధించిన నూతన ఎగ్జిక్యూటివ్ కమిటీ, బోర్డ్ ఆఫ్ ట్రస్టీల వివరాలను అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్‌గా డాక్టర్ దివేష్ అనిరెడ్డి బాధ్యతలు చేపట్టారు.

**నూతన కార్యవర్గ సభ్యులు**
ప్రెసిడెంట్ ఎలక్ట్: ప్రీతి జొన్నలగడ్డ
వైస్ ప్రెసిడెంట్స్: అర్చన నమిలకొండ, శ్రీనివాస్ రణబోతు, స్వాతి సుదిని
సెక్రటరీ: శ్రీనివాస్ గిల్లేపల్లి
జాయింట్ సెక్రటరీ: రాజేందర్ లంబు
ట్రెజరర్: విజేందర్ దుంబాల
జాయింట్ ట్రెజరర్: అవినాష్ కల్యాంకర్
పాస్ట్ ప్రెసిడెంట్: శ్రీనివాస్ మాణికొండ
వీరితో పాటు అమెరికాలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న 14 మంది సభ్యులతో కూడిన బోర్డ్ ఆఫ్ ట్రస్టీలను కూడా సంస్థ పరిచయం చేసింది.

నూతన బాధ్యతలు చేపట్టిన సహచరులకు ప్రెసిడెంట్ డాక్టర్ భరత్ నరవెట్ల శుభాకాంక్షలు తెలిపారు. కార్యవర్గ సభ్యులందరి అంకితభావం, నూతన నాయకత్వ పటిమతో తెలంగాణ సమాజంపై మరింత సానుకూల ప్రభావం చూపే దిశగా సంస్థను ముందుకు తీసుకెళ్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ సంస్కృతిని కాపాడుతూ సేవా కార్యక్రమాల్లో సరికొత్త ఆవిష్కరణలకు ఈ వేదిక కానుందని పేర్కొన్నారు.

# బెంగాల్‌లో తొలిసారి కొలువు తీరిన కమలం

## సీఎంగా సువేందు అధికారి ప్రమాణస్వీకారం



పశ్చిమ బెంగాల్‌లో మొట్టమొదటిసారి భాజపా సర్కారు కొలువుదిరింది. నూతన ముఖ్యమంత్రిగా భాజపా నేత సువేందు అధికారి శనివారం ప్రమాణస్వీకారం చేశారు. కోల్కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో సువేందు చేత బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రమాణం చేయించారు. ఈ వేడుకకు ప్రధాని నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్, రేఖా గుప్తా, భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు హాజరయ్యారు. 55 ఏళ్ల సువేందు.. బెంగాల్‌కు 9వ సీఎం. ఆయనతో పాటు భాజపా నేతలు దిలీప్ ఘోష్, అగ్నిమిత్రా పాల్, అశోక్ కీర్తనియా, నితీశ్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడూ మంత్రులుగా ప్రమాణం చేశారు. 1970 డిసెంబరు 15న బెంగాల్ తూర్పు మేదినీపూర్ జిల్లాలో సువేందు జన్మించారు. 1998లో మమతా బెనర్జీ స్థాపించిన తృణమూల్ కాంగ్రెస్లో చేరారు. అప్పటినుంచి దీదీకి నమ్మినబంటులా మారారు. 2004లో తమలుక్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2006లో తొలిసారి కాంథీ దక్షిణ్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత రెండుసార్లు ఎంపీగా గెలిచి లోక్సభకు వెళ్లారు. గతంలో మమతా బెనర్జీ క్యాబినెట్లో మంత్రిగా పని చేశారు. మమత మేనల్లుడి కారణంగా ఆమెతో విభేదించి.. 2020లో టీఎంసీని వీడి కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటినుంచి రాష్ట్రంలో భాజపాను ముందుండి నడిపించారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్లో, తాజా ఎన్నికల్లో భవానీపూర్లో మమతా బెనర్జీని రెండుసార్లు ఓడించి సంచలనం సృష్టించారు.



## కొత్త సీడీఎస్‌గా ఎన్ఎస్‌రాజా సుబ్రమణి

నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి(రిటైర్డ్)ని ప్రభుత్వం నియమించింది. ఆయన భారత సైనిక వ్యవహారాల శాఖ కార్యదర్శిగా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం సీడీఎస్‌గా ఉన్న జనరల్ అనిల్ చౌహాన్ పదవీకాలం మే 30తో ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి తదుపరి ఆదేశాలు వచ్చేవరకు జనరల్ రాజా సుబ్రమణి ఆ పదవిలో కొనసాగనున్నారు. మరోవైపు చీఫ్ ఆఫ్ నావల్ స్టాఫ్‌గా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ నియమితులయ్యారు. మే 31న బాధ్యతలు స్వీకరించి డిసెంబర్ 31, 2028 వరకూ ఆ పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం ఆయన వెస్టర్న్ నావల్ కమాండర్‌గా విధుల్లో ఉన్నారు.

### తమిళనాట వీడిన ఉత్కంఠ

# నేడు కొత్త సీఎంగా విజయ్ ప్రమాణం

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కీలక మలుపులు తిరిగిన తమిళనాడు రాజకీయాల్లో అనిశ్చితి వీడుతోంది. అత్యధిక స్థానాలు గెలిచిన విజయ్ నేతృత్వంలోని టీవీకేకు కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు తెలపడంతో ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ లైన్ క్లియర్ చేసినట్లు తెలుస్తోంది. శనివారం గవర్నరు కలిసి తమకు మద్దతిచ్చిన పార్టీల లేఖలను అందజేసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. మెజార్టీ మార్క్ (118)కు చేరుకోవడంతో గవర్నర్ సమ్మతించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు టీవీకే చీఫ్ విజయ్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది. దీనిపై లోక భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

ప్రభుత్వ ఏర్పాటులో టీవీకేకు మద్దతు ఇస్తోన్న వీసీకే.. క్యాబినెట్ బెర్త్ లు మాత్రం వద్దని చెప్పింది. "మేం ప్రభుత్వంలో చేరబోం. వెలుపలి నుంచే మద్దతు ఇస్తాం. భవిష్యత్ లో ప్రభుత్వంలో భాగం అవుతామా లేదా..? అన్నది చెప్పలేం. రాష్ట్రపతి పాలనను నివారించేందుకు, ప్రజల తీర్పును నెరవేరేలా చేసేందుకు ప్రభుత్వ ఏర్పాటులో భాగం అవుతున్నాం" అని వీసీకే చీఫ్ తిరుమావళవన్ మీడియాకు వెల్లడించారు. తాము ఇప్పటికీ డీఎంకే నేతృత్వంలోని కూటమిలోనే ఉన్నామని వీసీకే, ఐయూఎంఎల్ వెల్లడించడం గమనార్హం. ఇప్పటికే వామపక్షాలు కూడా క్యాబినెట్ పదవులు వద్దని చెప్పిన విషయం తెలిసిందే. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో చెన్నై సమీపంలో టీవీకే ఎమ్మెల్యేలు ఉంటున్న రిసార్ట్ బయట భద్రతను భారీగా పెంచారు.



# గెలిపించిన ప్రజలకు మోకాళ్లపై వంగి కృతజ్ఞతలు

## బీజేపీ సీనియర్ నేతకు ప్రధాని మోదీ పాదాభివందనం



అధికారి ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఓ ఆసక్తికర సన్నివేశం కన్పించింది. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రధానమంత్రి నరేంద్రమోదీ వేదికపై ఓ వృద్ధుడి కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నారు. దీంతో ఆయన ఎవరా అని నెటిజన్లు ఆరా తీస్తున్నారు. ఆయన మరెవరో కాదు.. భాజపా సీనియర్ నేత మఖన్లాల్ సర్కార్. పశ్చిమ బెంగాల్‌లో భాజపా అత్యంత సీనియర్ నేతల్లో మఖన్లాల్ ఒకరు. స్వతంత్ర భారతంలో జరిగిన జాతీయోద్యమం సమయంలో కీలకంగా వ్యవహరించారు. 1952లో కశ్మీర్ శ్యామాప్రసాద్ ముఖర్జీతో పాటు ఉద్యమంలో పాల్గొన్న ఆయన.. అక్కడ భారత జెండా ఎగురవేసిన ఘటనలో జైలుకెళ్లారు. 1980లో భాజపా ఏర్పాటైన తర్వాత.. పశ్చిమ దినాజ్పూర్, జల్పాయురి, డార్జిలింగ్ జిల్లాలకు సంస్థాగత కోఆర్డినేటర్‌గా పనిచేశారు. కేవలం ఏడాది వ్యవధిలోనే పార్టీలోకి 10వేల మంది సభ్యులను తీసుకురాగలిగారు. 1981 నుంచి వరుసగా ఏడేళ్ల పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించారు. ప్రస్తుతం ఆయన వయసు 98 ఏళ్లు. పశ్చిమబెంగాల్లో భాజపా తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుండటంతో ఈ కార్యక్రమానికి మఖన్‌లాల్‌ను ఆహ్వానించి కమలదళం ఆయనను ప్రత్యేకంగా గౌరవించింది. ఈ సందర్భంగా వేదికపై ప్రధాని మోదీ ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. మఖన్లాల్ పాదాలకు నమస్కరించి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఇక, ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం.. భాజపాను గెలిపించిన బెంగాల్ ప్రజలకు మోదీ మోకాళ్లపై వంగి కృతజ్ఞతలు తెలియజేశారు.

# మోదీ ప్రధాని అయ్యాక తొమ్మిది రాష్ట్రాల్లో కొలువైన తొలి బీజేపీ ముఖ్యమంత్రులు

పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ 15 ఏళ్ల పాలనకు భాజపా చెక్ పెట్టింది. 2014లో నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి దేశంలోని అనేక రాష్ట్రాల్లో కాషాయ జెండాలు రెపరెపలాడాయి. 2014లో ప్రధాని మోదీ నేతృత్వంలోని భాజపా మొదటిసారి హరియాణాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, మనోహర్ లాల్ ఖట్టర్ను ముఖ్యమంత్రిగా నియమించింది. 2016 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించి.. మహాయుతి కూటమిలోని మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో దేవేంద్ర ఫడణవీస్ మహారాష్ట్రకు తొలి భాజపా ముఖ్యమంత్రి అయ్యారు. 2016లో అస్సాంలో విజయం సాధించి ఈశాన్య ప్రాంతంలో భాజపా తన ప్రాబల్యాన్ని విస్తరించుకుంది. సర్బానంద సోనోవాల్ భాజపా తొలి ముఖ్యమంత్రి అయ్యారు. అనంతరం వరుసగా జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించింది. 2016లో అరుణాచల్లో జరిగిన పలు నాటకీయ పరిణామాల తర్వాత భాజపా తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2016 జులైలో కాంగ్రెస్ నేత పెమా ఖండూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. సెప్టెంబర్లో ఆయన తన 33మంది ఎమ్మెల్యేలతో కలిసి భాజపా మిత్రపక్షమైన పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్‌లో చేరారు. అనంతరం ఆ పార్టీ భాజపాలో విలీనం అవ్వడంతో 2016 డిసెంబర్లో సుస్థిర భాజపా ప్రభుత్వం ఏర్పడింది. పెమా ఖండూ సీఎంగా కొనసాగుతున్నారు. 2017లో మణిపూర్ ఎన్నికల అనంతరం నేషనల్ పీపుల్స్ పార్టీ, నాగా పీపుల్స్ ఫ్రంట్ ఇతర ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకొని భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీరెన్ సింగ్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 2018 ఎన్నికల్లో త్రిపురలోని లెఫ్ట్ ఫ్రంట్ దశాబ్దాల సుదీర్ఘ పాలనకు తెరదించి కాషాయ పతాకాన్ని ఎగరేసింది. విప్లబ్ కుమార్ దేబ్ నేతృత్వంలో తొలి భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2024లో ఒడిశాలో జరిగిన ఎన్నికల్లో బిజు జనతా దళ్‌ను ఓడించి తూర్పు భారతదేశంలోనూ మరో ముందడుగు వేసింది. మోహన్ చరణ్ మాఝి భాజపా తొలి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. 2025 బీహార్ ఎన్నికల్లో భాజపా ఎన్డీఏ మిత్రపక్షమైన జేడీయూ సహకారంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నితీశ్ ఈ ఏడాది ప్రారంభంలో రాజ్యసభకు వెళ్లారు. దీంతో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న భాజపా నేత సమ్రాట్ చౌదరీ ముఖ్యమంత్రి అయ్యారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్నికల్లో భాజపా భారీ విజయాన్ని సాధించింది. రాష్ట్రంలో తొలి భాజపా ముఖ్యమంత్రిగా సుమేదు అధికారి బాధ్యతలు చేపట్టారు.

# మళ్లీ.. చర్చల బాట

## ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ సిట్టింగ్





పశ్చిమాసియాలో సంఘర్షణను ముగించడమే లక్ష్యంగా కీలక ముందడుగు పడింది. ఓ ఒప్పందానికి సంబంధించి అమెరికా– ఇరాన్ మరోసారి చర్చలకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు ఇరుదేశాల ప్రతినిధులు వచ్చేవారం రానున్నట్టు మీడియాలో కథనాలు వస్తున్నాయి. సంఘర్షణకు ముగింపు పలకడమే లక్ష్యంగా.. 14 పాయింట్ల అవగాహన ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేసే అవకాశం ఉందని ఆ కథనాలు వెల్లడించాయి. ఇందులో ఇరాన్ అణు కార్యక్రమం, దానివద్ద ఉన్న యురేనియం నిల్వల బదిలీ, హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలను తగ్గించడంవంటి కీలక విషయాలున్నాయి. తమపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని టెహ్రాన్ ముందునుంచీ డిమాండ్ చేస్తూ వస్తోంది. ఈ చర్చలకు ఇవే అడ్డంకిగా మారాయి. కాగా.. చర్చలు సానుకూలంగా సాగితే ఇరుదేశాల మధ్య కొనసాగుతోన్న కాల్పుల విరమణ ఒప్పందం మరికొంతకాలం పొడిగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇక, పశ్చిమాసియా సంఘర్షణ ముగించేందుకు తాము పంపిన ప్రతిపాదనలపై ఇరాన్‌నుంచి నేడు స్పందన వచ్చే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఇరాన్ ఉద్దేశపూర్వకంగానే ఈ విషయాన్ని సాగదీస్తుందా? అని విలేకరులు అడగ్గా.. త్వరలోనే మనకు దీని గురించి తెలుస్తుందన్నారు. హర్మూజ్‌లో చిక్కుకుపోయిన నౌకలను సురక్షితంగా బయటకు తెచ్చేందుకు చేపట్టిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను తిరిగి పునరుద్ధరించే విషయాన్ని తమ యంత్రాంగం పరిశీలిస్తుందని ట్రంప్ అన్నారు. ఇరాన్ త్వరగా ఒప్పందంపై సంతకం చేయకపోతే.. ఈ కార్యక్రమాన్ని 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ప్లస్'గా నిర్వహిస్తామన్నారు. నౌకలను సురక్షితంగా బయటకు తీసుకురావడంతో పాటు మరికొన్ని చర్యలను కూడా చేపడతామన్నారు.

### అలా అయితే.. విపత్కర పరిణామాలు తప్పవు: ఇరాన్ హెచ్చరిక

అమెరికాకు ఇరాన్ గట్టి హెచ్చరికలు చేసింది. ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్‌కు యూఎన్‌లోని ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్ సయీద్ ఇరవానీ ఓ లేఖ రాశారు. ఇందులో హర్మూజ్ జలసంధిలో సైనిక చర్యలకు దిగి యూఎస్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపించారు. పర్షియన్ గల్ఫ్, హర్మూజ్‌లలో యూఎస్ తన సైనిక కార్యకలాపాలు కొనసాగిస్తే.. విపత్కర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# హర్మూజ్ సమీపంలో చెక్క పడవలో మంటలు

### -భారతీయుడి మృతి, నలుగురికి గాయాలు



హర్మూజ్ జలసంధి సమీపంలో అమెరికా–ఇరాన్ బలగాల మధ్య కాల్పులు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘర్షణల వల్ల.. 18మంది భారతీయులతో వెళ్తున్న ఒక చెక్క పడవలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరికి గాయాలయ్యాయి. ఓ చెక్క పడవ దుబాయ్‌నుంచి యెమెన్ లోని ముక్కంకు బయలుదేరింది. ఇందులో 18మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. అమెరికా– ఇరాన్ బలగాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణల్లో భాగంగా ఈ పడవపైనా కాల్పులు జరపడంతో మంటలు చెలరేగి పడవ బోల్తా పడింది. ఈ ఘటనలో ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురికి కాలిన గాయాలయ్యాయి. దీన్ని గుర్తించిన అటుగా వెళ్లిన మరో పడవలోని వారు కాలుతున్న పడవలోని సిబ్బందిని రక్షించి వారందరినీ దుబాయ్ పోర్టుకు తరలించారు. అనంతరం గాయపడిన వారికి స్థానిక ఆస్పత్రిలో వైద్యచికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తిని అల్తాఫ్ తలబ్ కేర్గా గుర్తించారు. ఇంజిన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న అతడు.. గుజరాత్‌లోని ద్వారకాకు చెందినవాడని తెలుస్తోంది. సముద్రంలో జరిగిన ఒక దురదృష్టకర ఘటనలో నౌకలోని సిబ్బంది ఒకరు మరణించారని దుబాయ్‌లోని భారత్ కాన్సులేట్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలుసుకునేందుకు పడవ యజమానితో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపింది. ఈ క్రమంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చింది.

## రష్యా-ఉక్రెయిన్ మధ్య 3 రోజుల కాల్పుల విరమణ


### యుద్ధం ముగింపునకు ఇది ఆరంభ సూచిక: ట్రంప్



మూడురోజులపాటు కాల్పుల విరమణకు రష్యా, ఉక్రెయిన్ అంగీకరించినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. తన అభ్యర్థన మేరకు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన వెల్లడించారు. సుదీర్ఘ యుద్ధం ముగింపునకు ఇది ఆరంభమని ట్రంప్ ఆశాభావం వ్యక్తంజేశారు. శని, ఆది, సోమవారాల్లో రెండుదేశాలూ ఎలాంటి కాల్పులకు, యుద్ధానికి పాల్పడకుండా ఉండటమేగాకుండా... వెయ్యిమంది చొప్పున యుద్ధఖైదీలను పరస్పరం బదిలీ చేసుకుంటాయని తెలిపారు. "శనివారం రష్యాలో విక్టరీ డే. రెండో ప్రపంచయుద్ధంలో నాజీలపై విజయానికి ప్రతీకగా రష్యా ఈ విక్టరీడేని నిర్వహిస్తుంది. ఉక్రెయిన్‌కు కూడా ఇది విక్టరీ డేనే. ఈ రెండు దేశాల మధ్య యుద్ధం ముగింపునకు చర్చలు సాగుతున్నాయి. త్వరలోనే సత్ఫలితం రావొచ్చు' అని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో వివరించారు.

## అందుబాటులోకి ఎప్‌స్టీన్ ఫైల్స్

### సీక్రెట్ రీడింగ్ రూమ్ ఏర్పాటు చేసిన ఎన్జీవో



ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్‌కు సంబంధించిన ఫైళ్లన్నీ ఓ లైబ్రరీ ద్వారా ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. దీనికి సంబంధించి అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఒక రీడింగ్ రూమును ఏర్పాటు చేశారు. ఆ నగరం సమీపంలోని ట్రైబెకా ప్రాంతంలో వాటిని ప్రదర్శనకు ఉంచారు. మే 8నుంచి 21వరకు ప్రజలు వీటిని చదవడానికి వీలుందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ రాకెట్‌కు సంబంధించిన 3.5 మిలియన్ల ఫైళ్లను దశలవారీగా అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రైమరీ ఫ్యాక్ట్స్ అనే ఎన్జీఓ ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసింది. 3,700 వాల్యూమ్స్ 'డొనాల్డ్ జె ట్రంప్ అండ్ జెఫ్రీ ఎప్‌స్టీన్ మెమోరియల్ రీడింగ్ రూమ్' పేరిట వాటిని అందుబాటులో ఉంచింది. అపాయింట్‌మెంట్ తీసుకున్నవారే ఈ రీడింగ్ రూముకు వెళ్లడానికి వీలుంటుంది. భద్రతా కారణాలతో నిర్వాహకులు గ్యాలరీ అడ్రెస్‌ను రహస్యంగా ఉంచారు.

ట్రంప్, ఎప్ స్టీన్‌ల మధ్య సంబంధాలు ఎప్పుడు మొదలై, ఎప్పటివరకు కొనసాగాయో కూడా ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారట. ఎప్ స్టీన్ వర్గం చేసిన నేరాలు, వాటిని కప్పిపుచ్చడానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలనుంచి ప్రజల దృష్టి మళ్లకుండా చేసేందుకే ఈ ఏర్పాటు అని ఎన్జీఓ వెబ్‌సైట్ పేర్కొంది. అలాగే న్యాయకోసం పోరాడుతున్న బాధితులకు మద్దతుగా నిలిచే ప్రయత్నమని రాసుకొచ్చింది.

## ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు చైనా సాయం



ఆపరేషన్ సిందూర్‌లో తాము ఎలాంటి పాత్ర పోషించలేదంటూ ఇన్నాళ్లూ బుకాయిస్తూ వచ్చిన చైనా తొలిసారిగా నిజం ఒప్పుకుంది. పాక్‌కు క్షేత్రస్థాయిలో సాంకేతిక సహకారం అందించినట్టు చైనా తొలిసారిగా బహిరంగంగా అంగీకరించింది. ఏవియేషన్ ఇండస్ట్రీ కార్పొరేషన్ ఆఫ్ చైనా (ఏవీఐసీ)కి చెందిన చెంగ్డు ఎయిర్‌క్రాఫ్ట్ డిజైన్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఇంజనీర్ల ఇంటర్వ్యూను ప్రభుత్వ వార్తా సంస్థ సీసీటీవీ ప్రసారం చేసింది. అందులో నాలుగు రోజుల పాటు భారత్–పాక్ మధ్య జరిగిన యుద్ధంలో తాము పాకిస్థాన్ అధికారులతో కలిసి పనిచేసినట్టు జాంగ్ అనే ఇంజినీర్ తెలిపారు. ఆయన ప్రకటనతో చైనాకు చెందిన నిపుణులు నేరుగా పాక్‌లో ఉండి భారత్‌తో జరిగిన యుద్ధంలో పాల్గొన్న విషయం వెల్లడైంది.

## కిమ్ హత్య జరిగితే.. అణు దాడులే!



### తన విధానాలను సవరించుకున్న ఉ.కొరియా?

ఉత్తరకొరియాలో కిమ్ జోంగ్ ఉన్ నియంతృత్వ పాలన గురించి ఎప్పటికప్పుడు అనూహ్య విషయాలు వెలుగులోకి వస్తుంటాయి. తాజాగా అలాంటి కీలక విషయమే బయటకు వచ్చింది. ఒకవేళ ఏదైనా దాడుల్లో కిమ్ మరణిస్తే.. తక్షణమే అణుదాడులు చేసేలా ఉ.కొరియా తన విధానాలను సవరించినట్టు తెలుస్తోంది. ఈమేరకు మీడియాలో కథనాలు వస్తున్నాయి. అమెరికా– ఇజ్రాయెల్ తొలిరోజు జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ సహా అనేక మంది సీనియర్ నాయకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఉత్తరకొరియా ఈ మార్పులు చేసినట్టు తెలుస్తోంది. ఇటీవల ప్యాంగ్యాంగ్‌లో జరిగిన 15వ సుప్రీం పీపుల్స్ అసెంబ్లీ మొదటి సమావేశంలో ఈ రాజ్యాంగ సవరణను ఆమోదించినట్టు కథనాలు పేర్కొన్నాయి. ఈ మార్పులకు సంబంధించిన వివరాలను తాజాగా దక్షిణ కొరియాకు చెందిన నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీసెస్ తమ ఉన్నతాధికారులతో పంచుకుంది. ఉ.కొరియా తన రాజ్యాంగంలోని అణ్వాయుధాల పాలసీని సవరించినట్టు పేర్కొంది. తాజాగా సవరించిన చట్టం ప్రకారం.. దేశ అణ్వాయుధ వ్యవస్థపై కిమ్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఒకవేళ శత్రుదాడుల్లో ఆయన మరణిస్తే.. వెంటనే అణ్వాయుధ దాడులు చేపట్టొచ్చు. ఇక, ఈ ఏడాది దక్షిణ కొరియా సరిహద్దు సమీపంలో దీర్ఘశ్రేణి ఆయుధ వ్యవస్థలను మోహరించాలని ప్యాంగ్యాంగ్ యోచిస్తున్నట్లు కూడా తాజాగా బయటకు వచ్చింది.

# రాజస్థాన్‌పై గుజరాత్ గర్జన..!



- రాజస్థాన్‌పై 77 పరుగుల భారీ విజయం
- గిల్ విధ్వంసం.. రషీద్ స్పిన్ మాయాజాలం.. ప్లే ఆఫ్స్‌కు అడుగు దూరంలో టైటాన్స్

ఐపీఎల్-2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ అద్భుత జోరు కొనసాగిస్తోంది. శనివారం జైపూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై 77 పరుగుల భారీ తేడాతో విజయం సాధించిన గుజరాత్ టైటాన్స్ వరుసగా నాలుగో గెలుపును నమోదు చేసింది. ఈ విజయంతో ఏడో గెలుపును ఖాతాలో వేసుకున్న టైటాన్స్ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి దూసుకెళ్లి ప్లే ఆఫ్స్ బెర్త్‌కు అడుగు దూరంలో నిలిచింది. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ ఐదో స్థానానికి పడిపోయి ప్లే ఆఫ్స్ అవకాశాలను క్లిష్టంగా మార్చుకుంది.

ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. ఓపెనర్లు సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ తొలి నుంచే దూకుడుగా ఆడి రాజస్థాన్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. సాయి సుదర్శన్ 36 బంతుల్లో 55 పరుగులు చేసి హాఫ్ సెంచరీ సాధించగా, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కేవలం 44 బంతుల్లో 84 పరుగులతో చెలరేగిపోయాడు. అతని ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 3 భారీ సిక్సర్లు ప్రేక్షకులను అలరించాయి. చివర్లో వాషింగ్టన్ సుందర్ 20 బంతుల్లో 37 పరుగులతో మెరిపించి జట్టుకు భారీ స్కోర్ అందించాడు.

229 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ ఆరంభం నుంచే తడబడింది. మహమ్మద్ సిరాజ్ పవర్ ప్లేలోనే ప్రమాదకర బ్యాటర్ వైభవ్ సూర్యవంశీని ఔట్ చేయడంతో మ్యాచ్ పూర్తిగా గుజరాత్ వైపు మలుపు తిరిగింది. అనంతరం స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ తన మాయాజాలంతో రాజస్థాన్ బ్యాటింగ్‌ను కుప్పకూల్చాడు. ఒకే ఓవర్‌లో ధ్రువ్ జురెల్, డోనవన్ ఫెరీరాలను ఔట్ చేసి రాజస్థాన్‌కు కోలుకోలేని దెబ్బతీశాడు.

రాజస్థాన్ రాయల్స్ 16.3 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. వైభవ్ సూర్యవంశీ 36 పరుగులు, రవీంద్ర జడేజా 38 పరుగులతో పోరాడినా మిగతా బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. రషీద్ ఖాన్ 4 వికెట్లతో చెలరేగగా, జాసన్ హోల్డర్ మూడు వికెట్లు, కగిసో రబాడ రెండు వికెట్లు తీసి రాజస్థాన్ పతనాన్ని శాసించారు.

బ్యాటింగ్‌లో గిల్ తుఫాన్ ఇన్నింగ్స్, బౌలింగ్‌లో రషీద్ స్పిన్ మాయాజాలంతో గుజరాత్ టైటాన్స్ మరోసారి ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ప్లే ఆఫ్స్ దిశగా టైటాన్స్ బలంగా దూసుకెళ్తుండగా, రాజస్థాన్‌కు ఇక ప్రతి మ్యాచ్ 'డూ ఆర్ డై'గా మారింది.

## టీమిండియా టీ20 కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్!



*భారత టీ20 క్రికెట్ జట్టు నాయకత్వంలో త్వరలో ఒక సంచలన మార్పు చోటుచేసుకోబోతున్నట్లు సమాచారం. ప్రస్తుతం టీ20 సారథిగా ఉన్న సూర్యకుమార్ యాదవ్ స్థానంలో స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా నియమించాలని బీసీసీఐ గట్టిగా యోచిస్తోంది. కొంతకాలంగా ఐపీఎల్‌లో అయ్యర్ చూపించిన అద్భుతమైన నాయకత్వ ప్రతిభే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. కేవలం బ్యాటర్‌గానే కాకుండా ఒక వ్యూహకర్తగా జట్టును విజయపథంలో నడిపించడంలో అయ్యర్ సఫలమవ్వడం సెలెక్టర్లను ఆకర్షించింది.*

*శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీ రికార్డును పరిశీలిస్తే అతను ఎందుకు ఈ రేసులో ముందంజలో ఉన్నాడో అర్థమవుతుంది. 2024 ఐపీఎల్ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ టీమ్‌ను మూడవసారి ఛాంపియన్‌గా నిలబెట్టడంలో అతను కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత 2025 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జట్టుకు సారథ్యం వహించి ఆ జట్టును ఫైనల్ వరకు తీసుకువెళ్లాడు. వరుసగా రెండు సీజన్లలో రెండు వేర్వేరు జట్లను అద్భుతంగా నడిపించిన తీరు అయ్యర్ నాయకత్వ పటిమకు నిదర్శనంగా నిలిచింది.*

*ప్రస్తుతం శ్రేయస్ అయ్యర్ కెరీర్‌లో అత్యుత్తమ ఫామ్‌లో ఉండటం కూడా అతనికి కలిసి వచ్చే అంశం. మరోవైపు సూర్యకుమార్ యాదవ్ వ్యక్తిగత బ్యాటింగ్‌పై మరింత దృష్టి సారించేలా చేయాలని, భవిష్యత్తులో వచ్చే మెగా టోర్నీల కోసం అయ్యర్ వంటి దీర్ఘకాలిక కెప్టెన్‌ను సిద్ధం చేయాలని బోర్డు భావిస్తోంది. ఈ మార్పునకు సంబంధించి బీసీసీఐ త్వరలోనే అధికారిక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇది గనుక జరిగితే టీమిండియా టీ20 జట్టులో ఒక సరికొత్త శకం మొదలవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.*

## ఐపీఎల్ చరిత్రలో కేఎల్ రాహుల్ సరికొత్త రికార్డు



టీమిండియా స్టార్ బ్యాటర్, ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ కేఎల్ రాహుల్ ఐపీఎల్ చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని రీతిలో అద్భుతమైన రికార్డులను తన ఖాతాలో వేసుకుంటున్నాడు. ఐపీఎల్ 2026లో భాగంగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన 51వ మ్యాచ్‌లో రాహుల్ ఈ అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. మూడు వేర్వేరు ఐపీఎల్ జట్ల తరఫున.. అంటే పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్, ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్‌తో వెయ్యి కంటే ఎక్కువ పరుగులు చేసిన మొట్టమొదటి ఆటగాడిగా రాహుల్ చరిత్ర సృష్టించాడు.

గతంలో ఢిల్లీ తరఫున అత్యంత వేగంగా 1,000 పరుగులు చేసిన రికార్డు రిషబ్ పంత్, జేపీ డుమిని పేరిట ఉండేది. వీరిద్దరూ ఈ మార్కును దాటడానికి తలో 35 ఇన్నింగ్స్‌లు తీసుకున్నారు. అయితే కేఎల్ రాహుల్ కేవలం 24 ఇన్నింగ్స్‌ల్లోనే వెయ్యి పరుగుల మార్కును చేరుకుని వారి రికార్డును తుడిచిపెట్టేశాడు. ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున వెయ్యి పరుగులు పూర్తి చేసిన 11వ బ్యాటర్‌గా కూడా నిలిచాడు. గణాంకాలపరంగా చూస్తే ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున రాహుల్ ప్రదర్శన అత్యంత నిలకడగా సాగుతోంది.

ప్రస్తుతం రాహుల్ 50.35 సగటుతో మొత్తం 1,007 పరుగులు పూర్తి చేశాడు. ఇందులో రెండు అద్భుతమైన సెంచరీలు, ఆరు అర్ధ సెంచరీలు ఉండటం విశేషం. కీలకమైన సమయంలో రాహుల్ ఫామ్‌లోకి రావడమే కాకుండా ఇలాంటి భారీ రికార్డులను అధిగమించడం ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో, అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఐపీఎల్ చరిత్రలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజాలు ఉన్నప్పటికీ... మూడు వేర్వేరు ఫ్రాంచైజీల తరఫున ఇంతటి నిలకడ ప్రదర్శించి 1,000 పరుగుల చొప్పున సాధించడం కేఎల్ రాహుల్‌కే సాధ్యమైంది.

## పతక రేసులో సాహిల్, సిమ్రన్

### సెమీస్‌కు భారత ఆర్చర్లు



షాంఘై: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-2 పోటీల్లో భారత ఆర్చర్లు సిమ్రన్‌జీత్ కౌర్, సాహిల్ జాధవ్ వ్యక్తిగత విభాగాల్లో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి పతక రేసులో నిలిచారు. మహిళల వ్యక్తిగత రికర్వ్ ఈవెంట్ క్వార్టర్ ఫైనల్లో సిమ్రన్ 6-0తో ఫాంగ్ యూ జు (తైవాన్)పై గెలిచింది. సెమీస్‌లో ప్రపంచ నెం.1 కాంగ్ చాయెంగ్ (దక్షిణ కొరియా)తో సిమ్రన్ తలపడనుంది. మిగతా భారత ఆర్చర్లలో దీపికాకుమారి, కుమ్‌కుమ్ నాలుగో రౌండ్లోనే ఓటమిపాలయ్యారు. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత ఈవెంట్ క్వార్టర్స్‌లో సాహిల్, అతని ప్రత్యర్థి నికో వీనర్ (ఆస్ట్రియా) ఇద్దరూ చెరో 147 పాయింట్లు స్కోరు చేసి సమంగా నిలిచారు. దీంతో ఫలితం కోసం అనివార్యమైన షూట్‌లో సాహిల్ 10-9తో నికోను ఓడించి నికోలస్ గిరార్డ్ (ఫ్రాన్స్)తో సెమీస్ పోరుకు సిద్ధమయ్యాడు. తెలుగు ఆర్చర్లు జ్యోతి సురేఖ (కాంపౌండ్), ధీరజ్ (రికర్వ్) వ్యక్తిగత విభాగాల్లో నాలుగోరౌండ్లోనే ప్రత్యర్థుల చేతిలో ఓడి నిరాశపరిచారు. సిమ్రన్, సాహిల్ సెమీస్‌లో ఓడితే కాంస్యం కోసం ప్రత్యర్థులతో తలపడాల్సి ఉంటుంది.

## ప్రైజ్‌మనీ ఇప్పించండి

### క్రీడా మంత్రిత్వ శాఖను ఆశ్రయించిన గ్రాండ్ మాస్టర్ అభిజిత్ గుప్తా



*భారత గ్రాండ్ మాస్టర్, అర్జున అవార్డు గ్రహీత అభిజిత్ గుప్తా తనకు న్యాయం చేయాలంటూ క్రీడా మంత్రిత్వ శాఖను ఆశ్రయించాడు. ఒడిశా ఓపెన్ నిర్వాహకుల నుంచి తనకు రావాల్సిన ప్రైజ్‌మనీ ఇప్పించాలని కోరాడు. ఐదు నెలలు కావొస్తున్నా నిర్వాహకులు స్పందించట్లేదని వాపోయిన అభిజిత్.. ఈ విషయంలో చొరవ తీసుకోవాలని క్రీడా మంత్రిత్వ శాఖకు విన్నవించుకున్నాడు.*


*ఒడిశా ఓపెన్-2026 (పదహారో అంతర్జాతీయ గ్రాండ్‌మాస్టర్ చెస్ ఫెస్టివల్) జనవరి 16 -24 మధ్య జరిగింది.*

*ఈ టోర్నీలో అదరగొట్టిన అభిజిత్ గుప్తా విజేతగా అవతరించాడు. ఛాంపియన్‌గా నిలిచినందుకు అతడికి రూ. 5.5 లక్షల నగదు బహుమతి దక్కాలి. కానీ నిర్వాహకులు మాత్రం ఈ టోర్నీ ముగిసి ఐదు నెలలు కావొస్తున్నా ప్రైజ్‌మనీ ఇవ్వలేదు. తనకు రావాల్సిన డబ్బుల గురించి అఖిల భారత చెస్ సమాఖ్యకు, ఒడిశా ఓపెన్ నిర్వాహకులకు అభిజిత్ పలుమార్లు లేఖలు రాసినప్పటికీ న్యాయం జరుగలేదు. దాంతో.. విసుగొచ్చిన అతడు క్రీడా మంత్రిత్వ శాఖను సంప్రదించాడు.*

*'ఒక క్రీడాకారుడిగా విజయాల కంటే ఓటములను అంగీకరించడం నేర్చుకుంటాం. ఇదంతా క్రీడలో భాగం. కానీ టోర్నీలో గెలిచిన తర్వాత ప్రైజ్‌మనీ అందుకోకపోవడం మరింతగా బాధిస్తోంది. ఈ ఏడాది జనవరిలో నేను ఒడిశా ఓపెన్ గెలుపొందాను. ప్రైజ్‌మనీని నెల రోజుల్లో ఇస్తామని నిర్వాహకులు హామీ ఇచ్చారు. నెల గడిచినా నాకు నగదు బహుమతి ఇవ్వలేదు. ఇదేంటి? అని అడుగబోతే నిర్వాహకులు స్పందించడం లేదు. అఖిల భారత చెస్ సమాఖ్య ఆధ్వర్యంలో టోర్నీ జరిగినందున ఏఐసీఎఫ్ అధ్యక్షుడు, సెక్రటరీలను సంప్రదించాను. కానీ దురదృష్టవశాత్తు వారు కూడా ఈ సమస్యను పరిష్కరించలేకపోయారు.*

*అర్జున అవార్డు గ్రహీతనైనా నాకు ఇలాంటి పరిస్థితి ఎదురవ్వడంతో.. నేను ఈ స్థాయికి రావడానికి పడిన కష్టాలు గుర్తుకొస్తున్నాయి. అందుకని నాకు రావాల్సిన ప్రైజ్‌మనీ ఇప్పించాల్సిందిగా కేంద్ర యువజన మంత్రిత్వ, క్రీడా శాఖను అభ్యర్థిస్తున్నా. నాకు చెల్లించని డబ్బుల గురించే కాదు.. భారత్‌లోని ప్రతి చెస్ క్రీడాకారుల గౌరవం, నమ్మకాన్ని కాపాడం గురించి అని నేను మీకు తెలియజేస్తున్నా' అని అభిజిత్ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నాడు.*

చైతన్య రథం
సినిమా
ఆదివారం 10 మే 2026 X




# రౌడీ జనార్ధన

## విజయ్ దేవరకొండ బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్

ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్‌లో స్టార్ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న క్రేజీ మూవీ "రౌడీ జనార్ధన". స్టార్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ రవి కిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా రూపొందుతోంది.

హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు బర్త్ డే విషెస్ చెప్తూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు "రౌడీ జనార్ధన" మూవీ మేకర్స్. వర్షంలో తడుస్తూ చేతిలో పిస్టల్‌తో ఉన్న విజయ్ స్టిల్ ఆకట్టుకుంటోంది. ఆయన ఛాతీపై హీరోయిన్ కీర్తి సురేష్ కాలు పెట్టినట్టు చూపించడం ఆసక్తి కలిగిస్తోంది. ఈ పోస్టర్ యాక్షన్‌తో పాటు రొమాంటిక్ యాంగిల్‌ను ఎస్టాబ్లిష్ చేస్తోంది. "రౌడీ జనార్ధన" సినిమాను సిల్వర్ స్క్రీన్‌పై చూసేందుకు రౌడీ ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ వెయిట్ చేస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్లో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

# 'రణబాలి' కోసం గుర్రపు స్వారీ



టాలీవుడ్ స్టార్ విజయ్ దేవరకొండ పుట్టినరోజు (మే 9) సందర్భంగా ఆయన అభిమానులకు చిత్ర బృందం అదిరిపోయే అప్డేట్ ఇచ్చింది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న హీరో హీరోయిన్లుగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి' నుంచి ఒక ప్రత్యేక బీటీఎస్ వీడియోను విడుదల చేశారు. ఈ చిత్రం 1854-1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. తాజాగా విడుదలైన వీడియోలో ఈ సినిమా కోసం విజయ్ దేవరకొండ గుర్రపుస్వారీ ఎలా నేర్చుకున్నారో చూపించారు. యుద్ధ సన్నివేశాల కోసం ఆయన పడుతున్న శ్రమను చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. 'టాక్సీవాలా' వంటి హిట్‌ను అందించిన దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్-రష్మిక జంటగా వస్తుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. చారిత్రక నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో విజయ్ దేవరకొండ సరికొత్త గెటప్‌లో కనిపించబోతున్నారు. పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.

# 'పని రాక్షసుడు' నాని



నాని.. ఈ పేరు ఇప్పుడు తెలుగు సినీ ఇండస్ట్రీలో ఒక బ్రాండ్‌గా మారిపోయింది. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన తన టాలెంట్, కష్టంతో నేచురల్ స్టార్ స్థాయికి ఎదిగారు. ప్రతి పాత్ర కోసం పూర్తిస్థాయిలో సిద్ధమయ్యే నాని డెడికేషన్ గురించి ఇండస్ట్రీలో ప్రత్యేకంగా మాట్లాడుకుంటుంటారు. ఇప్పుడు ఆయన నటిస్తున్న అవైటెడ్ మూవీ ప్యారడైజ్ కోసం నాని పడుతున్న కష్టం గురించి ఆయన జిమ్ ట్రైనర్ విశ్వ భరత్ వెల్లడించిన విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం 'ప్యారడైజ్' షూటింగ్ ఫుల్ స్వింగ్‌లో సాగుతోందని, ఆ సినిమా కోసం నాని తన శరీరాన్ని పూర్తిగా మార్చుకుంటున్నారని తెలిపాడు. "ఉదయం 5 గంటలకు లేచి, 6 గంటలకే సెట్స్‌లో ఉంటారు. సాయంత్రం 7 గంటల వరకు యాక్షన్ సీన్లు చేస్తూనే ఉంటారు. రోప్స్ కట్టుకుని చేసే యాక్షన్ సీక్వెన్స్‌ల వల్ల బాగా అలసిపోతారు. అయినా అక్కడితో ఆగరు" అని విశ్వ చెప్పాడు. షూటింగ్ ముగిసిన తర్వాత కూడా నాని విశ్రాంతి తీసుకోకుండా వర్కౌట్ కొనసాగిస్తారని వెల్లడించాడు. సాయంత్రం ఆయన అసిస్టెంట్ నుంచి నాకు కాల్ వస్తుంది. నాని అన్న 40 నిమిషాలు ఇంట్లో ఉంటారు.. వర్కౌట్ చేస్తారు అని చెప్తారు. అప్పటికే ఉదయం నుంచి షూటింగ్‌లో అలసిపోయి ఉన్నా, మరో 45 నిమిషాలు కచ్చితంగా జిమ్ చేస్తారు. ఇవాళ వదిలేద్దాం అని ఎప్పుడూ అనరు అంటూ నాని క్రమశిక్షణను ప్రశంసించాడు.

# మెట్రో నగరంలో... రొమాంటిక్ కామెడీతో...!



యువతను ఆకట్టుకునే కథలతో అలరిస్తోంది "ప్రేమలు" భామ మమిత బైజ. ప్రస్తుతం 'విశ్వనాథ్ అండ్ సన్స్", 'ఇరండు వానం' లాంటి చిత్రాలతో బిజీగా గడుపుతోన్న ఈ తార.. ఇప్పుడు మరో సినిమాని పట్టాలెక్కించింది. మలయాళ నటుడు సంగీత్ ప్రతాప్, మమిత ఓ చిత్రంలో నటిస్తున్నట్లు ఇటీవలే ప్రకటించిన సంగతి తెలిసిందే. దినోయ్ పౌలోస్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించినట్లు సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించింది మమిత. ఇంకా పేరు ఖరారు కాని ఈ చిత్రాన్ని ఆషిక్ ఉస్మాన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. మెట్రో నగర నేపథ్యంలో.. రొమాంటిక్ కామెడీ జానర్లో దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు, త్వరలో పూర్తి వివరాల్ని వెల్లడించనున్నారని చిత్ర వర్గాలు తెలిపాయి. సురేశ్‌కృష్ణ కీలక పాత్ర పోషిస్తున్నారు.

# రామ్‌చరణ్ 'పెద్ది' ప్రమోషన్స్‌లో ధోనీ

## రాంచీ వేదికగా భారీ ఈవెంట్‌కు ప్లాన్



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు కాంబినేషన్‌లో వస్తున్న భారీ ప్రాజెక్ట్ 'పెద్ది'. వృద్ధి సినిమాస్ నిర్మిస్తున్న ఈ స్పోర్ట్స్ డ్రామాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ సినిమా ప్రమోషన్స్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'పెద్ది' ప్రమోషన్స్ కోసం లెజెండరీ క్రికెటర్ ఎంఎస్ ధోనీ రంగంలోకి దిగుతున్నట్టు తెలుస్తోంది. సాధారణంగా సినిమాల ప్రమోషన్లు హైదరాబాద్ లేదా చెన్నైలో మొదలవుతాయి. కానీ 'పెద్ది' టీమ్ ధోనీ సొంత ఊరైన జార్ఖండ్ రాజధాని రాంచీని ప్రమోషన్ల ప్రారంభ వేదికగా ఎంచుకున్నట్లు సమాచారం. రాంచీలో నిర్వహించబోయే ఈ భారీ ఈవెంట్‌కు ధోనీని చీఫ్ గెస్ట్‌గా తీసుకువచ్చేందుకు మేకర్స్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ క్రికెటర్ పాత్రలో కూడా కనిపించనున్నారు. అందుకే ధోనీ ఈ ఈవెంట్‌కు వస్తే సినిమా హైప్ నెక్స్ట్ లెవెల్‌కు వెళ్తుందని మేకర్స్ భావిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 4న థియేటర్లలో విడుదల కానుంది. రామ్ చరణ్ గ్లోబల్ ఇమేజ్‌కి ధోనీ క్రేజ్ తోడైతే బాక్సాఫీస్ రికార్డులు బద్దలవ్వడం ఖాయమని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ఈ ఈవెంట్‌పై అధికారిక స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# అంతరాత్మ మాటే వింటాను



### శోభితా ధూళిపాళ్ల

తన మనసు చెప్పే మాటకే ప్రాధాన్యతనిస్తానని నటి శోభితా ధూళిపాళ్ల స్పష్టం చేశారు. ఇటీవల ఒక ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌కు రిప్లై ఇస్తూ ఆమె తన జీవిత దృక్పథాన్ని పంచుకున్నారు. పరిస్థితులు ఎలా ఉన్నా సరే అంతరాత్మ చెప్పే మాట విన్నప్పుడే జీవితంలో అర్థవంతమైన క్షణాలను ఆస్వాదించానని తెలిపారు. మనసు మాట వినకుండా చేసిన పనులు ఏవీ తనకు కలిసి రాలేదని, అందుకే ఎప్పుడూ తనను తాను గౌరవించుకుంటూ ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. జీవితం అనేది నదిపై సాగే ఒక చిన్న ప్రయాణం వంటిదని, ప్రతిదాన్నీ ఆస్వాదించాలని ఆమె రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ రిప్లై సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఈ ఏడాది ప్రారంభంలో 'చీకటిలో' వెబ్ సిరీస్‌తో ప్రేక్షకులను పలకరించిన శోభిత... ప్రస్తుతం పా రంజిత్ దర్శకత్వంలో 'వెట్టువం' అనే తమిళ సినిమాలో నటిస్తున్నారు. ఇది ఒక గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతోంది. పెళ్లి తర్వాత ఆమె నటిస్తున్న మొదటి తమిళ చిత్రం ఇదే కావడం విశేషం.

# 'రావు బహదూర్' జూలై 3న వరల్డ్ వైడ్ రిలీజ్

సూపర్‌స్టార్ మహేష్‌బాబు, నమ్రతా శిరోద్కర్ జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథా నాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సైకాలజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్' చిత్రాన్ని సగర్వంగా సమర్పిస్తున్నారు. వెంకటేష్ మహా ఈ చిత్రానికి దర్శకత్వం వహించడమే కాకుండా కథ, ఎడిటింగ్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏంఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న 'ఓ సుందరి' పాట సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. వింటేజ్ వాతావరణాన్ని అద్భుతంగా రీక్రియేట్ చేసిన ఆ పాటలోని మెలోడీ, విజువల్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ చిత్రాన్ని జూలై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తాజాగా మేకర్స్ ప్రకటించారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో సత్యదేవ్ వయసు పైబడిన రాయల్ లుక్‌లో కనిపించారు. రాయల్ పర్పుల్ దుస్తులు, ముత్యాల అలంకరణలు, హ్యాండ్ ఫ్యాన్, వెనుక గ్రాండ్ సెటప్ కలిసి ఓ మిస్టీరియస్ అరిస్టోక్రాటిక్ ప్రపంచాన్ని చూపిస్తున్నాయి. పోస్టర్ మొత్తం సైకాలజికల్ డ్రామాకు తగ్గట్టుగా ఇంటెన్స్ వాతావరణాన్ని సృష్టిస్తోంది. ఈ చిత్రంలో దీపా థామస్ కథా నాయికగా నటిస్తుండగా... వికాస్ ముప్పాల, బాలా పరాశర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాక, మాస్టర్ కిరణ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

ఈ చిత్రానికి స్ట్రాంగ్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. కార్తిక్ పరమార్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, స్మరణ్ సాయి సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలను రోహన్ సింగ్ నిర్వహిస్తున్నారు. రాయల్ విజువల్స్, మిస్టీరియస్ టోన్‌తో 'రావు బహదూర్' నెవర్ బిఫోర్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించబోతోంది. విడుదలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ మేకర్స్ నుంచి మరిన్ని ఆసక్తికర అప్డేట్స్ రానున్నాయి.

